సాక్షి 24|7
రాజన్న సిరిసిల్ల
గురువారం 4-1-2018



విధులు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

స్వచ్ఛతకు ముందడుగు!

- గ్రేడింగ్ ద్వితీయం.. ఆదర్శం ప్రథమం
- యాప్‌తో సమస్యల పరిష్కారానికి యత్నం
- స్వచ్ఛ సర్వేక్షన్ - 2018 పోటీలకు సర్వం సిద్ధం
- గత అవార్డుల స్ఫూర్తి.. ఆత్మవిశ్వాసంతో ముందుకు..
- ఆదర్శ మున్సిపాలిటీగా సిరిసిల్ల బల్దియా

స్థాయికి ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ. అయినా స్వచ్ఛతలో అగ్రపథంలో నడుస్తోంది. ‘స్వచ్ఛ భారత్’లో ఇప్పటికే రెండుసార్లు జాతీయ, మరోరెండు పర్యాయాలు రాష్ట్రస్థాయి అవార్డులు సాధించి ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తితో మరో పురస్కారం సాధించేందుకు సిరిసిల్ల బల్దియా ముందడుగు వేస్తోంది. ‘స్వచ్ఛ సర్వేక్షణ్ – 2018లో జాతీయస్థాయి బహుమతి పొందేందుకు యత్నిస్తోంది. స్వచ్ఛతా హీ సేవ, స్కోచ్ అవార్డులు కైవసం చేసుకుని దేశవ్యాప్త కీర్తి పొందిన పాలకవర్గం.. అధికార యంత్రాంగం.. గురువారం నుంచి జరిగే ‘స్వచ్ఛ సర్వేక్షణ్’ పురస్కారంలో ఉత్తమ ర్యాంకు సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

– సిరిసిల్లటౌన్ - వివరాలు 2లో ▸



సిరిసిల్ల అశోక్‌నగర్‌లో మూతబడినప్రాథమిక పాఠశాల

మూతబడి

- ఫలితమివ్వని ‘బడిబాటలు’
- కనీస సంఖ్యలో విద్యార్థులులేరు
- ఇప్పటికే పది సర్కారీ పాఠశాలల మూసివేత
- ఆంగ్లమాధ్యమం అమలు చేస్తే కొన్నింటికి పునర్జీవం!
- మళ్లీ తెరిపించేందుకు అవకాశం ఉన్నా పట్టని పాలకులు
- మూతపడిన పాఠశాలల స్థలాలు, భవనాలు కబ్జాకు యత్నం!
- ఇతర అవసరాలకు వినియోగిస్తామంటూ విద్యాశాఖకు వినతులు
- జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల దుస్థితి ఇదీ..

2లో ▸

విద్యార్థుల సంఖ్య తగ్గిందనే కారణంతో జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాలను రెండేళ్లక్రితం మూసివేశారు. ఉపాధ్యాయుల్లో కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని డెప్యుటేషన్‌పై వేరే స్కూల్‌కు పంపించారు. అయితే, ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన ప్రారంభించని కారణంగానే సర్కారు బడి మాన్పించి తమ పిల్లలను ప్రైవేటు స్కూల్‌లో చేర్పించామని తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఐదుగురు విద్యార్థులు ఉన్నారనే కారణంతో ఇల్లంతకుంట మండలం తెలుగువాణిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మూడేళ్లక్రితం మూసివేశారు. సువిశాల మైదానాన్ని క్రీడలు, పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. ఓ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇందులో ఆడుతూ పాడుతూ చదువుకునే చిన్నారులను తదుపరి చదువుల కోసం ఏ పాఠశాలలోనూ చేర్పించడంలేదు.

విద్యార్థులు లేక మూతబడిన ప్రాథమిక పాఠశాలలివే..

మండలం	గ్రామం
సిరిసిల్ల	అశోక్‌నగర్‌కాలనీ
రుద్రంగి	చింతామణితండా
చందుర్తి	లింగంపేట, గోస్కులపల్లి
వేములవాడ	నాగయ్యపల్లి, ఎస్సీకాలనీ
కోనరావుపేట	గోవిందరావుపల్లె
గంభీరావుపేట	కొన్నాలపల్లి
తంగళ్లపల్లి	చిన్నలింగాపూర్
ఇల్లంతకుంట	తెలుగువాణిపల్లి

ఇట్లాంటి ప్రభుత్వ పాఠశాలలు 2016-17 విద్యాసంవత్సరం నాటికి జిల్లావ్యాప్తంగా 10కి చేరాయి. 2017-18లో బడిబాట నిర్వహించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. పాలకులు, నాయకులు, అధికారులకు మూతపడిన వాటిని తెరిపించేందుకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ రెండు ఉదాహరణలే చెబుతున్నాయి.

- సిరిసిల్లఎడ్యుకేషన్

మినీ FOCUS ఉపాధి ‘కల్పన’ 7లో ▸

ఊరు పేరు నిలబెడదాం

‘ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించాం. బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం అమలు చేస్తున్నాం.. మురుగునీటి కాలువలు నిర్మించాం. బహిరంగంగా చెత్తాచెదారం పడవేయడాన్ని నియంత్రించి స్వచ్ఛత సాధించాం. ఇప్పటికే రెండు ‘స్వచ్ఛ’ పురస్కారాలు సాధించాం. ఇదేస్ఫూర్తితో ‘స్వచ్ఛ సర్వేక్షన్-2018’ లోనూ అవార్డు గెలుచుకుని ఊరు పేరు నిలబెడదాం’ అని కలెక్టర్ కృష్ణభాస్కర్ అన్నారు. - సిరిసిల్లటౌన్

- వివరాలు 2లో ▸



రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తుల బారులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో బుధవారం రద్దీ పెరిగింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అనుబంధ దేవాలయాలను సందర్శించారు. మాజీ మంత్రి బసవరాజు సారయ్య రాజన్నను దర్శించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

కదిలిన యంత్రాంగం

- నాలుగు వాహనాలపై కేసు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్లక్రైం: ఇసుక వక్రమార్గాన కదులుతోందని వీడియోలు.. ఆడియోలు ఉన్నధికారులకు అందినా ఇన్నాళ్లూ మిన్నకుండిన వాళ్లంతా ఎట్టకేలకు కదిలారు. 'ఆగని ఇసుక దందా' పేరిట 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయమే ఇసుక రవాణా జరుగుతున్న తీరుపై జిల్లా పోలీసులు ఆరా తీయగా.. రవాణాశాఖాధికారులు ఏకంగా వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలకు వెళ్లారు. ఈసందర్భంగా నాలుగు వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు ఏఎంవీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మళ్లీ ఓవర్‌లోడ్..

పలు ఇసుక రీచ్‌ల్లోంచి ఓవర్‌లోడ్‌తో లారీలు వెళ్తున్నట్లు ఇప్పటికే పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనితో మైనింగ్ అధికారులు డిసెంబర్‌లో తనిఖీలు చేసి ఓవర్‌లోడ్ లారీలపై కేసులు నమోదు చేసి జరిమానాలు వేశారు. మరోవైపు.. కలెక్టర్ పర్యటించి హెచ్చరికలు జారీ చేసినా ఇసుక తోడేళ్లలో ఏ మాత్రం మార్పు రాలేదు. మంగళవారం కొడిముంజ ఇసుక రీచ్‌ను ఆకస్మికంగా కలెక్టర్ కృష్ణభాస్కర్ తనిఖీ చేసి అధికారులపై మండిపడిన విషయం విదితమే. కానీ తెల్లవారు జామున మళ్లీ ఓవర్‌లోడ్‌తో నాలుగు లారీలు వెళ్తుండగా ఏఎంవీఐ విజయ్‌కుమార్ మాటువేసి పట్టుకున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తుండగా నాంపల్లి వద్ద తనిఖీ చేసి ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు.

ప్రజావసరాల కోసమే మోడల్ ఠాణాలు

- అడిషనల్ ఎస్పీ రవీందర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామీణుల అవసరాలకు అనుగుణంగా మోడల్ పోలీస్‌స్టేషన్‌లు నిర్మస్తున్నామని అడిషనల్ ఎస్పీ రవీందర్ తెలిపారు. స్థానిక మోడల్ ఠాణా నిర్మాణాన్ని బుధవారం పరిశీలించారు. పనుల్లో మార్పులు, చేర్పులపై సిబ్బందికి సూచనలు చేశారు. సెంట్రీపోస్టు, రిసెప్షన్ కౌంటర్, లాకప్, ఆయుధగదులు తనిఖీ చేశారు. కేసుల వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటతోపాటు మూడో మోడల్ ఠాణాను వేములవాడలో నిర్మిస్తామన్నారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచి డీఎస్పీ నరహరి, సిరిసిల్ల పట్టణ సీఐ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్సైలు ఉన్నారు.

మూత'బడి'

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, డ్రాపౌట్స్‌ను నివారించేందుకు ప్రభుత్వం ఏటా బడిబాట నిర్వహిస్తోంది. ప్రవేశాల పేరిట పల్లెల్లో ప్రచారం చేసినట్లు విద్యాశాఖ కితాబిచ్చినా.. విద్యార్థుల సంఖ్య స్వల్పంగా పెరగడం తప్ప మూతపడిన వాటిని తెరిపించిన దాఖలాలు లేవు. జిల్లాలో మూడేళ్లలో మూతబడిన బడులకు పూర్వవైభవం సంతరించుకోవడంలేదు. కానీ, ప్రచారం పేరిట విద్యాబోధన సమయంలో తరగతులకు గైర్హాజరు కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంగ్లమాధ్యమంలేకనే..

పల్లెలోనే ప్రాథమిక పాఠశాలు ఉన్నా చాలా బడుల్లో అంగ్లమాధ్యమం నిర్వహణలేదు. అందుకే ఆమడ దూరంలోని ప్రైవేట్ ఇంగిల్ష్ మీడియం పాఠశాలలకు తమ పిల్లలను పంపుతున్నామని కొందరు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధనతోపాటు, అందుకు అనుగుణంగా సిబ్బందిని సమకూర్చినా తాము మళ్లీ సర్కారు బడిలోనే చేర్చుతామంటున్నారు. ఇందుకు తాము సిద్ధమని చెప్పడం మినహా లిఖిత పూర్వక అనుమతులు మంజూరు చేయడంలో విద్యాశాఖ అధికారులు ముందుకు రావడంలేదనే విమర్శలు ఉన్నాయి.

మూత'బడు'లకు కబ్జాల భయం..

జిల్లాలో రెండు, మూడేళ్లుగా మూతబడి ఉన్న పది పాఠశాలల భవనాలను స్థానికులు తమ అవసరాల కోసం వినియోగించుకుంటామని ఇప్పటికే అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని అశోక్ ప్రాథమిక పాఠశాల భవనంలో ఐటీఐ నిర్వహణ కోసం ఎంఈవోను కొందరు అనుమతి అడిగనట్లు తెలిసింది. ఇల్లంతకుంట మండలం తెలుగువానిపల్లె, కోనరావుపేట మండలం బావుసాయిపేట, గోవిందరావుపల్లె స్కూల్ భవనాలు ఏళ్లుగా మూతపడి ఉన్నాయి. ఈ భవనాలను పంచాయతీ కార్యాలయాల కోసం వినియోగించేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో పోకిరీలు మద్యం తాగేందుకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని సమాచారం. మూతపడిన స్కూళ్లను పట్టించుకోకుంటే వాటిస్థలాలు కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులంటున్నారు.



మూతపడిన తెలుగువానిపల్లెలో పాఠశాల

పదిమంది ఉంటే తెరుస్తాం



కనీసం పది మంది విద్యార్థులు ఉంటేనే పాఠశాల నిర్వహణ సాధ్యం. అంతకన్నా తక్కువ సంఖ్యలో ఉంటే సమీప బడిలో విద్యార్థులను చేర్చుతాం. విద్యార్థుల సంఖ్య పెరిగిన ఒకటి, రెండు స్కూళ్లను పునఃప్రారంభించాం. డిమాండ్‌ను బట్టి ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధనకు ఉత్తర్వులు జారీ చేస్తాం. ఈవిషయాన్ని 'బడిబాట'లోనే స్పష్టం చేశాం.

- రాధాకిషన్, డీఈవో

ఆంగ్ల మాధ్యమం లేకనే..



మాఊరులోని ప్రాథమిక పా ఠశాల మూడేళ్లక్రితం మూతవడ్డది. ఇంగ్లిష్ మీడియంలో చదువు చెబితే విద్యార్థులు మళ్లీ ఇటే వస్తరు. అంగన్‌వాడీలో చదివే వారిని సైతం ఇందులో చేర్చుకోవడానికి వీలుంది. ఈసారి ప్రైవేట్ స్కూల్స్‌ళ్లలో ముందుగా అడ్మిషన్లు అయిన తర్వాత సర్కారు బడుల్లో ప్రవేశాలు కల్పిస్తమనడం సరికాదు. ఇట్లాగైతే మరికొన్ని స్కూళ్లు మూతపడ్తయి.

- చొప్పరి వేణు, సర్పంచ్, తెలుగువానిపల్లె, ఇల్లంతకుంట

'స్వచ్ఛతకు ముందడుగు!

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్లలో నూరుశాతం స్వచ్ఛత దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే బల్దియా అధికారులు పక్కా ప్రణాళికతో పనులు చేపడుతున్నారు. బహిరంగ ప్రదేశాలల్లో మల, మూత్ర విసర్జన నిషేధం అమలు చేస్తున్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా కట్టుదిట్టం చేశారు. పట్టణంలో 16వేలకు పైగా నివాసాలుండగా నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా చేసి ఓడీఎఫ్ సాధించారు. ఇక చెత్త సేకరణలో నాలుగేళ్లుగా ఇంటింటికీ రెండు చెత్త బుట్టలు అందించి అందులో ఒకటి తడి, మరోటి ద్వారా పొడి చెత్త సేకరిస్తున్నారు. రోజూ సేకరిస్తున్న చెత్తతో వర్మీకంపోస్టు(ఎరువు) తయారు చేస్తున్నారు. జనసాంధ్రత అధికంగా ఉండే ప్రదేశాల్లో పబ్లిక్ టాయిలెట్స్, మహిళలకు ప్రత్యేకంగా షీటాయిలెట్స్ నిర్మించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధం, తడి, పొడి చెత్త సేకరణలో నాలుగేళ్లుగా చేపట్టి ఇప్పటికే జాతీయస్థాయిలో స్కోచ్ అవార్డు కైవసం చేసుకున్నారు. 2017 జూన్ 2న పారిశుధ్యం విభాగంలో జాతీయ స్థాయిలో 'స్వచ్ఛత' అవార్డు తీసుకుని సిరిసిల్ల బల్దియా ప్రత్యేకత చాటుకుంటుంది.

యాప్‌తో సమస్యలకు చెక్..

పట్టణం అన్నివిధాలా అభివృద్ధి సాధించడానికి స్థానిక ఎమ్మెల్యే కె.తారకరామారావు మంత్రిగా ఉన్న రాష్ట్ర పురపాలనశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌ను వినియోగంలోకి తెచ్చారు. దీనిని స్మార్ట్ ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను పొందుపర్చాలి. పట్టణంలోని అన్ని ఏరియాల్లో పేరుకుపోయిన సమస్యలను ఒక్క క్లిక్‌తో ఫొటో తీసి లేదా మెసెజ్ చేస్తే.. అధికారులు 24 గంటల్లోపు పరిష్కరిస్తారు. దీని వినియోగంపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలో ఎక్కడైనా పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిదీపాల విషయాలపై ఫిర్యాదులు ఉంటే యాప్ ద్వారా పంపితే సత్వరమే పరిష్కారమవుతాయి.

పరుగులు పెడుతున్న అభివృద్ధి..

మంత్రి కేటీఆర్ సారథ్యంలో సిరిసిల్ల మున్సిపాల్టీ అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. పట్టణంలోని ప్రధాన రోడ్ల అభివృద్ధి పనులు ఇప్పటికే సాగుతుండగా.. కొత్తగా పార్కులు, పర్యాటక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.2 కోట్ల వ్యయంతో మూడు పార్కులు ముస్తాబవుతున్నాయి. కేటీఆర్ అందించిన రూ.32 కోట్లతో అన్నివార్డుల్లో సీసీరోడ్లు, మురుగునీటి కాలువలు, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నారు. వీటి పనులు ఇప్పటికే 60 శాతానికి పైగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణ శివారుల్లోని కొత్తచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా, కార్గిల్‌లేక్ చెరువును సుందరీకరణకు రూ.10కోట్లకు పైగా నిధులు వెచ్చించి పర్యాటక కేంద్రాలుగా మారుస్తున్నా రు. రూ.3.50 కోట్లతో శ్మశానవాటికలు, రూ.84 లక్షల వ్యయంతో ప్రధాన కూడళ్ల సుందరీకరణ, వీటితోపాటు ప్రధాన రోడ్లపై అధునాతన సెంట్రల్ లైటింగ్, స్విమ్మింగ్‌పూల్, ఇంటింటా తాగునీరు పనులు సాగుతున్నాయి.



స్వచ్ఛసర్వేక్షణ్ రన్‌లో పట్టణ ప్రముఖులు

స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యమిదీ..

దేశంలోని మున్సిపాల్టీలో అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా నిలిపేందుకు గాను కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యం. అన్నిమహానగరాలతోపాటు చిన్న మున్సిపాల్టీలు కూడా ఈపోటీలో పాల్గొని స్వచ్ఛత, అభివృద్ధిలో ముందుంటాయి. అన్ని వార్డుల్లోని మురుగునీటి కాల్వలు పరిశుభ్రంగా ఉంచడం, చెత్తను ఎప్పటికప్పుడు తరలించడం, డంపుయార్డులో కూడా చెత్త పేరుకుపోకుండా చూడాల్సి ఉంటుంది. పైగా ప్రజలు కూడా సర్వేక్షణ్‌లో భాగస్వామ్యం అవడం ద్వారా పట్టణాలు త్వరితగతంగా అభివృద్ధి సాధిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

టాప్ 10 ర్యాంకు లక్ష్యం



దేశంలోని అన్నిమున్సిపాల్టీలు, కార్పొరేషన్లతో సిరిసిల్ల పురపాలక సంఘం పోటీపడుతోంది. మొదటి 10 ర్యాంకులోపు లక్ష్యం సాధించేందుకు ముందుకు వెళ్తున్నాం. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా దుకాణాలు, హోటళ్లు, పాఠశాలలకు ర్యాంకులిచ్చి ప్రోత్సాహాలు అందిస్తున్నాం.

- సామల పావని, మున్సిపల్ చైర్‌పర్సన్

ఊరు పేరు నిలబెడదాం

- దేశంలో ఉన్నత ర్యాంకు సాధిద్దాం
- ప్రజల సహకారంతోనే స్వచ్ఛత సాధ్యం
- కలెక్టర్ కృష్ణభాస్కర్, సినీనటుడు సంపూర్ణేశ్‌బాబు
- సిరిసిల్లలో 'స్వచ్ఛత సర్వేక్షణ్'పై మానవహారం



స్వచ్ఛసర్వేక్షణ్‌పై ప్రతిజ్ఞ అధికారులు, విద్యార్థులు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛమైన ఊరుగా సిరిసిల్లను నిలబెడదామని కలెక్టర్ కృష్ణభాస్కర్ కోరారు. గురువారం నుంచి జాతీయస్థాయిలోని మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం జిల్లాకేంద్రంలో మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. స్వచ్ఛత అంశంలో ఇప్పటికే సిరిసిల్ల రెండు జాతీయ పురస్కారాలు అందుకుందని, అదేస్ఫూర్తిని స్వచ్ఛసర్వేక్షణ్‌లో చాటుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 'పట్టణంలోని ఏ వాడలోనైనా సమస్య ఉంటే యాప్ ద్వారా చెప్పండి.. వెంటనే పరిష్కరిస్తాం' అన్నారు. సినీనటుడు సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత సాధిస్తామన్నారు. ఈకార్యక్రమానకి తనను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించడం సంతోషాన్నిచ్చిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణ, దానితో వర్మీకంపోస్టు తయారు చేయడంపై సిరిసిల్ల మున్సిపల్ ముందంజలో ఉందన్నారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో తమ పాలకవర్గం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రమణాచారి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో రాణించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు, విద్యార్థులు, అతిథులు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రతిజ్ఞ చేశారు. బ్రాండ్ అంబాసిడర్లు సంపూర్ణేశ్‌బాబు, వైద్యురాలు శోబారాణి, రచయిత పత్తిపాక మోహన్‌కు జ్ఞాపికలు అందజేశారు. డీఈ నరేందర్, వైస్ చైర్మన్ తవుటు కనుకయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చిం తోజు భాస్కర్, మున్సిపల్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు, ఆర్వో స్వరూపరాణి, ఎస్సై శ్రీనివాస్, టీపీఎస్ అన్సార్, ఈఈ రఘు, కౌన్సిలర్లు నారాయణ, పూర్ణచందర్, పద్మ, అనూష, వెంకట్రాజం పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఉపాధి లేక గల్ఫ్ వెళ్తే..అక్కడ సైతం పరిస్థితులు అనుకూలించలేదు. అప్పులు మీదపడడంతో స్వగ్రామానికి తిరిగొచ్చాడు. తనకున్న ఐదెక రాలకు మరో నాలుగెకరాలు కౌలుకు తీసు కుని సాగుచేస్తే దిగుబడి రాక అప్పలు కుప్ప లయ్యాయి. వాటిని తీర్చే మార్గం లేక.. అప్పలవాళ్ల ఒత్తిళ్లు పెరగడంతో మనస్థాపా నికి గురైన యువరైతు ప్రాణాలు తీసుకు న్నాడు. ఒక్కగానొక్క కొడుకు దూరమై తల్లిదండ్రులు, భర్త దూరమై భార్య, తండ్రి ఇక లేడని చిన్నారి రోదనలు మిన్నంటాయి.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో మృతుడు మహిపాల్(ఫైల్)

అప్పల బాధతో యువరైతు ఆత్మహత్య

సారంగాపూర్‌లో విషాదం
- ఉపాధినివ్వని గల్ఫ్
- కలిసిరాని సాగు
- అప్పులు పెరిగి మనస్థాపంతో ఆత్మహత్య

సారంగాపూర్: అప్పుల బాధ భరించలేక జగిత్యాల జిల్లా సారంగాపూర్‌కు చెందిన యువ రైతు అత్తిని మహిపాల్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. మహిపాల్ ఆత్మహత్యతో వారి కుటుంబం రోడ్డుపాలైంది. గ్రామానికి చెందిన అత్తిని భూమయ్య, లక్ష్మి దంపతులకు మహిపాల్ ఒక్కగానొక్క కుమారుడు. జీవనోపాధి నిమిత్తం రెండుసార్లు దుబాయ్ వెళ్లి వచ్చాయి. అక్కడ కూడా సరిగ్గా ఉపాధి దొరక్కపోవడంతో ఏడాది క్రితం స్వగ్రామానికి తిరిగొచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. తనకున్న ఐదెకరాలతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి, పత్తి సాగు చేస్తున్నాడు. ఖరీఫ్‌లో రూ.2లక్షలు వెచ్చించి వ్యవసాయబావి తవ్వించాడు. గత ఖరీఫ్‌లో సన్నరకాలు వేయగా.. దోమపాటు ఆశించి ఎకరాకు ఏడు క్వింటాళ్ల దిగుబడి రాలేదు. కనీసం పెట్టుబడి కూడా మిగలలేదు. దీంతో అప్పులు దాదాపు రూ.5లక్షల వరకు చేరాయి. అప్పుల విషయంపై మహిపాల్ తరచూ భార్య రజిత, తల్లితండ్రులతో చర్చిస్తూ ఆందోళన చెందేవాడు. రబీలో కౌలుకు తీసుకున్న నాలుగెకరాల్లో వరినాట్లు పూర్తిచేశాడు. మంగళవారం భార్య రజితను తన తల్లిగారింటికి పంపించాడు. అప్పుల ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్ల పెరగడంతో మంగళవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి పడుకున్నాడు. ఉదయం ఏడుగంటలైన నిద్రలేవకపోవడంతో తల్లిదండ్రులు తలుపుల గడియ తొలగించి చూడగా విగతజీవిగా కనిపించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వలీబేగ్ తెలిపారు. మహిపాల్‌కు తొమ్మిదేళ్ల కుమారుడు రాజు ఉన్నాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ ఫోన్‌లో పరామర్శించారు.

ఒకరి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల మండలం టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన కోటగిరి జగదీశ్వర్(56) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టీఆర్‌నగర్‌కు చెందిన కోటగిరి జగదీశ్వర్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా తలకు బలమైన గాయాలుకాగా, కాలు, చెయ్యి సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో ఇంటి వద్ద ఉంటున్న జగదీశ్వర్ మనస్థాపానికి గురై బుధవారం ఉదయం ఇంటి వెనుక ఉన్న బాత్‌రూం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు వంశీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ
- ఒకరు మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మండలం జూబ్లినగర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన గిరిమల్ల రాజేంద్రప్రసాద్(34) మృతిచెందాడు. రాజేంద్రప్రసాద్ కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లిలో నివసిస్తున్నాడు. బుధవారం సోదరుడు సుధీర్‌తో కలిసి కారులో మంచిర్యాల వెళ్తుండగా జూబ్లినగర్ వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజేంద్రప్రసాద్, అతని అన్న సుధీర్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజేంద్రప్రసాద్ మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వేలిముద్రలు సేకరించిన పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని కృష్ణానగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. అల్లె రమేశ్‌కు చెందిన ఇంట్లో దొంగలు పడి రూ.13వేల నగదు, 1.75 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం సభ్యులు, ఎస్సై రాజు వేలిముద్రలు సేకరించారు. కృష్ణానగర్‌లో నివాసం ఉండే అల్లె రమేశ్ మంగళవారం తన ఇంటికి తాళం వేసి జాబితాపూర్‌లోని బంధువుల వద్దకు వెళ్లాడు. బుధవారం తిరిగి వచ్చేసరికి బీరువాలో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు.



దొంగలు చిందరవందర చేసిన వస్తువులు

బాలుడిని చిదిమేసిన ఆటో

గొల్లపల్లి(వెల్గటూర్): మండలంలోని కొత్తపేటలో ట్రాలీఆటో ఢీకొని చిన్నారి కొత్తపల్లి నితిక్(2) దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన విజయ్ కుమార్ కొడుకు నితిక్ బుధవారం రోడ్డుపై నిల్చొని ఉన్నాడు. జగిత్యాలకు చెందిన సిగిరి రాజు తన ట్రాలీఆటోలో కుర్చీలు విక్రయించేందుకు గ్రామానికి వచ్చాడు. ఇద్దరు మహిళలు కుర్చీలు కొనుగోలు చేసిన అనంతరం రాజు తన ఆటోను వెనుకకు తీసుకున్నాడు. అతివేగంగా వెనుకకు తీసుకుంటున్న క్రమంలో వెనుకాలే ఉన్న బాలుడు నితిక్‌ని ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. చిన్నారి మృతికి కారకుడైన రాజుపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నితిక్ మృతదేహం

87 మంది మందుబాబులకు జైలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడ్డ 87 మంది మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం వివిధ న్యాయస్థానాల్లో న్యాయమూర్తులు తీర్పునిచ్చారు. 87 మందిలో 21 మందికి రెండు నుంచి 4 రోజుల వరకూ జైలు విధించగా మరో 66 మందికి జరిమానాలు విధించారు. మొత్తంగా 87 మందికి కలిపి రూ.1,21,900 జరిమానా చెల్లించాలని తీర్పుచెప్పారు.

చెల్లని చెక్ ఇచ్చిన వ్యక్తికి జైలు

కరీంనగర్‌లీగల్: చెల్లని చెక్ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.రాజన్న తీర్పు చెప్పారు. కరీంనగర్‌లోని సిక్‌వాడికి చెందిన సర్దార్ రాజ్‌పాల్‌సింగ్ ఎల్‌ఎండీకాలనీలోని సీనియర్ ఇంజినీర్ కాలనీలో విధులు నిర్వర్తిస్తున్న బుర్ర శ్రీనివాస్ పరిచయస్తులు. 2008 మార్చి 28న శ్రీనివాస్ రూ.లక్ష అప్పుగా రాజ్‌పాల్‌సింగ్ వద్ద తీసుకుని పత్రం రాసి ఇచ్చాడు. తర్వాత కొన్ని రోజులకు అప్పు చెల్లించాలని కోరగా రూ.1.50లోలకు శ్రీనివాస్ చెక్ ఇచ్చాడు. చెక్కును రాజ్‌పాల్‌సింగ్ తన ఖాతాలో వేసుకోగా శ్రీనివాస్ ఖాతాలో సరిపడా డబ్బులు లేవని తిరిగి ఇచ్చాడు. చెక్ చెల్లకపోవడంతో నోటీస్ పంపించగా శ్రీనివాస్ నుంచి స్పందన రాలేదు. దీనిపై రాజ్‌పాల్‌సింగ్ కోర్టులో ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాల సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి బుధవారం నిందితుడైన శ్రీనివాస్‌కు ఆరు నెలల జైలుతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ము నుంచి రూ.25వేలు ఫిర్యాదుదారునికి నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి ఒకరు మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లింగాల దుద్దెనపల్లికి చెందిన దూల శంకర్(49) సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి మృతిచెందాడు. కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. మంగళవారం వాటికి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ తెలిపారు.

భారీగా గుట్కా పట్టివేత
- రూ.3లక్షల గుట్కాస్వాధీనం
- ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గుట్కాతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో బుధవారం భారీ ఎత్తున గుట్కా లభించింది. కొద్దినెలలుగా జగిత్యాల నుంచి కరీంనగర్‌కు గుట్కా రవాణా అవుతుందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంచింది. బుధవారం రాత్రి పక్కా సమాచారంతో టూటౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు వాహనాల తనిఖీతోపాటు పెట్రోలింగ్ నిర్వహించారు. పెట్రోలింగ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందానికి కరీంనగర్‌లోని శివ థియేటర్ సమీపంలో ఒకరు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని ప్రశ్నించేందుకు పోలీసులు వాహనం దిగగానే గమనించి సదరు వ్యక్తి తన వద్ద ఉన్న సంచులను వదిలీ పరారయ్యాడు. వెంటపడి పట్టుకుని, బస్తాలను పరిశీలించగా గుట్కా ఉత్పత్తులు కనిపించాయి. 18 బస్తాలతోపాటు అతన్ని అదుపులోకి తీసుకుని విచారింగా నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన దొంతల అక్షయ్‌కుమార్‌గా నిర్ధారణకు అయ్యింది. ఆదిలాబాద్ జిల్లా జన్నారం గ్రామానికి చెందిన శేఖర్ నుంచి గుట్కా కొనుగోలు చేసి కరీంనగర్‌కు సరఫరా చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈమేరకు అక్షయ్‌కుమార్‌తోపాటు శేఖర్‌పై కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీనివాసరావు, కిరణ్, టూటౌన్ సీఐ మహేశ్, ఎస్సై నాగరాజు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని సీపీ అభినందించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లికి చెందిన ఆకునూరి వెంకటమ్మ(108) చలి తీవ్రతతను తట్టుకోలేక బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి భర్త మల్లయ్య 1992లో అనారోగ్యంతో చనిపోయాడు. మృతురాలికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



వెంకటమ్మ(ఫైల్)

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరుగా వర్షం పడుతుంది. జమ్మూ, కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తేలికపాటి వాన లేదా మంచు కురిసే అవకాశం ఉంది. కేరళలోని కోస్తా ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షం కురుస్తుంది. ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్, బిహార్, అసోం, పశ్చిమబెంగాల్‌లలో మోస్తరు నుంచి దట్టమైన పొగమంచు కప్పి ఉంటుంది. ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో రోజంతా చల్లని వాతావరణం ఉంటుంది.

కరీంనగర్ వాతావరణం

గరిష్టం కనిష్టం

29.8°/12.5°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.4	07.4
కోల్‌కతా	23.8	13.7
బెంగళూరు	27.6	18.4
ముంబై	30.0	16.4
చెన్నై	30.2	22.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
కర్నూలు	32.3/19.7	రాజమండ్రి	30.3/19.4
అనంతపురం	32.0/17.1	తాడేపల్లిగూడెం	30.3/19.4
ఒంగోలు	31.9/22.2	వరంగల్	30.3/18.0
గుంటూరు	31.8/16.0	కాకినాడ	29.8/20.0
కడప	31.7/18.5	కరీంనగర్	29.8/12.5
నెల్లూరు	31.3/22.8	విజయవాడ	29.7/19.0
చిత్తూరు	31.2/19.3	విశాఖపట్నం	29.4/21.5
తిరుపతి	31.2/19.3	ఆదిలాబాద్	29.4/07.0
మహబూబ్‌నగర్	31.1/18.9	హైదరాబాద్	29.2/16.9
ఖమ్మం	31.0/14.2	రంగారెడ్డి	29.2/16.9
మెదక్	30.7/12.0	నల్లగొండ	29.2/15.0
నిజామాబాద్	30.4/14.9	శ్రీకాకుళం	28.0/16.0
ఏలూరు	30.3/19.4	విజయనగరం	28.0/16.0

బుల్లితెర

www.sakshi.com

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 మనసులో మాట
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 లక్కీ ఛాన్స్
ఉ.09.30 కూలీ
మ.12.00 శ్రీ షిర్డి సాయిబాబా మహాత్మ్యం
సా.06.00 బద్ర
రా.09.00 గగనం



మూవీస్ నౌ
ఉ.06.00 షాంఘై నూన్
ఉ.11.25 ఎంటర్ ద డ్రాగన్
మ.03.05 ఆక్టోపస్సీ
రా.07.15 జార్జ్ ఆఫ్ ద జంగిల్
రా.10.50 క్యాసినో రాయల్



హెచ్‌బీవో
ఉ.07.56 ద కరాటే కిడ్-2
మ.12.03 మ్యాన్ ఆఫ్ స్టీల్
మ.02.27 పుస్ ఇన్ బూట్స్
సా.05.53 ద డిక్టేటర్
రా.09.00 కుంగ్‌ఫు పాండా 2



స్టార్ మూవీస్
ఉ.06.55 ఏలియన్ వర్సెస్ ప్రిడేటర్
ఉ.11.15 కుంగ్‌ఫు హ్యాసిల్
మ.01.11 ఐస్ ఏజ్
సా.04.32 జుమాంజీ
రా.09.00 స్పీడ్



మా మూవీస్
ఉ.07.00 గోకులంలో సీత
మ.12.00 హ్యాపి
మ.03.00 శ్రీ
సా.06.00 అందరివాడు
రా.09.00 హలోబ్రదర్



జీ సినిమా
మ.12.23 రామయ్యా వస్తావయ్యా
మ.03.20 లింగా
సా.06.09 దేలింగ్‌బాజ్ 3
రా.09.00 శూర్‌వీర్
రా.11.49 షేర్ ఏ జిగర్

తిరుమల సమాచారం

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ చాలా తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే పరిస్థితి లేకుండా డైరెక్ట్‌గా పంపించేస్తున్నారు.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం, గదుల వివరాలు:

ఉచిత గదులు – 10 ఖాళీ ఉన్నాయి
రూ.50 గదులు – 25 ఖాళీ ఉన్నాయి
రూ.100 గదులు – 55 ఖాళీ ఉన్నాయి
రూ.500 గదులు – 10 ఖాళీ ఉన్నాయి

సేవలు

సహస్ర దీపాలంకరణ – 240 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 150 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం – 200 ఖాళీ ఉన్నాయి
గురువారం ప్రత్యేక సేవ – తిరుప్పావడ



వేములవాడ ఆలయ సమాచారం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. రాత్రి 8 గంటలకు అందిన సమాచారం మేరకు...

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	05	1,000
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	18	750
నందీశ్వర సాధారణ	41	350
రాజేశ్వరపురం ఏసీ	01	750
రాజేశ్వరపురం సాధారాణ	05	350
లక్ష్మీగణపతి	38	250
పార్వతీపురం	26	200
శివపురం	38	150
శంకరపురం	61	50

లడ్డూ ప్రసాదం, పులిహోరా, లడ్డూ భోగం అందుబాటులో ఉన్నాయి. – వేములవాడ



చికెన్ ధరలు

లైవ్ కోడి	:	120	బోన్‌లెస్	:	350
చికెన్	:	150	మటన్ కిలో	:	500
స్కిన్‌లెస్	:	170			- కరీంనగర్



Padi-Panta

వరిలో లద్దె పురుగు..

వీణవంక(హుజూరాబాద్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రబీ సాగు ఉపందుకుంది. ఇప్పటికే వరినాట్లు వేస్తున్నారు. వరిపైరుపై దాడి చేసే చీడపీడల్లో కాండం తొలుచు పురుగు అతి ప్రమాదకరమైనది. దీని ఉధృతి నారుమడి నుంచే అధికంగా ఉంటుంది. గింజపాలు పోసే వరకు పంటను నష్ట పరుస్తుంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే పురుగును నివారించి, పంటను కాపాడుకోవచ్చని వీణవంక వ్యవసాయాధికారి హరిత సూచిస్తున్నారు.



హరిత, ఏవో

వరికి కాండం తొలుచు పురుగు బెడద

- నారుమడి నుంచే ఉధృతి
- సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



నారుమడి

తల్లిరెక్క పురుగు

తల్లి రెక్కల పురుగు ముదురు గోధుమరంగులో ఉంటుంది. రెక్కల మధ్యలో నల్లని మచ్చ, ఉదరం చివరన పట్టు లాంటి వెంట్రుకలు కుచ్చుగా ఉంటాయి. నారుమడిలోనూ పంట వేసిన తర్వాత ఆకుల చివర పైభాగాన గుడ్లు పెట్టి వాటిని తన వెంట్రుకల కింద కప్పుతుంది. ఒక్కో సమదాయంలో 15– 80 గుడ్లు ఉంటాయి. తల్లి పురుగు 150– 300 వరకు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్ల నుంచి 5–8రోజుల్లో పిల్ల(లద్దె)పురుగులు బయటకు వస్తాయి. లద్దె పురుగు పసుపు కలిపిన తెలుపు రంగులోనూ, తలభాగం నారింజ రంగులో ఉంటుంది.

లద్దె పురుగు వృద్ధి..

లద్దె పురుగులు 4– 8 దశల్లో వృద్ధి చెందుతాయి. 30– 40 రోజుల్లో లార్వాదశను పూర్తి చేసుకుంటాయి. పిల్ల పురుగులు గుంపులుగా మొక్క పైభాగాన చేరి అక్కడి నుంచి గాలి, నీరు ద్వారా ఇతర మొక్కలకు చేరుకుంటాయి. సోకిన రెండు రోజుల్లో ఆకు తొడిమను గోకి తింటాయి, రెండో దశ నుంచి ఆకులను కత్తిరించి తమ చుట్టూ గొడుగులా చుట్టుకుంటాయి. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఈ పురుగు త్వరగా వృద్ధి చెందుతాయి. వాతావరణం అనుకూలంగా ఉంటే 6– 10 రోజుల్లో కోశస్థ దశ నుంచి రెక్కల పురుగుగా బయటకు వస్తుంది. కాండం తొలుచు పురుగు జీవిత కాలం కనీసం 50–68రోజులు ఉంటుంది.

చేనును ఇలా నష్టపరుస్తుంది..

లద్దె పురుగు నారుమడిలో కాండాన్ని తొలుస్తుంది. దీంతో నారు ఎరుపు రంగులోకి మారి చనిపోతుంది. పైరులో అయితే కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినేస్తుంది. దీంతో మొవ్వ ఎండిపోతుంది. దీన్నే ఊసతిరుగుడు రోగం అంటారు. మొవ్వను లాగితే తేలికగా వస్తుంది. దీని ఉధృతి ఎక్కువగా పైరు చిరుపొట్టలో ఉన్నప్పుడు సోకుతుంది. తద్వారా గింజ తాలు గింజలుగా మారి దిగుబడి తగ్గుతుంది.

నివారణ చర్యలు..

నారుమడి దశలో ఉన్నప్పుడు పురుగులు కనిపిస్తే నాటు వేయడానికి వారంరోజుల ముందు మడిలో నీరు పలుచగా పెట్టి 160గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లాలి. లేకుంటే లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల క్లోరిపైరిఫాస్ పిచికారీ చేయాలి. నాటు వేసేటప్పుడు నారు కొసలు తుంచి వేయాలి. నత్రజని వాడకంలోనూ సమతూల్యత పాటించాలి. పైరు పిలక దశలో ఉన్నప్పుడు ఐదు శాతం చనిపోయిన మొవ్వులు కనిపిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లీటరు నీటికి 2.5మి.లీ క్లోరిఫైరిఫాస్ లేదా 2మి.లీ మోనోక్రోటోఫాస్‌ను పిచికారీ చేయాలి. నాటు వేసిన 15– 25 రోజుల మధ్య ఎకరాకు 10కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను వేసుకోవాలి.



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
140	170

భవిష్యం

మేషం: పనులు ముందుకు సాగక నిరాశ చెందుతారు. ధనవ్యయం. అనారోగ్య సూచనలు. బంధు వర్గంతో విభేదాలు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

వృషభం: ప్రముఖుల నుంచి పిలుపు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకం. పలుకుబడి పెరుగుతుంది. వస్తులాభాలు. వృత్తి, వ్యాపారాలు సజావుగానే సాగుతాయి.



మిథునం: మిత్రులే శత్రువులుగా మారతారు. అనుకోని ఖర్చులు. ఆరోగ్యభంగం. శ్రమ తప్పదు. పనుల్లో అవరోధాలు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

కర్కాటకం: దూరప్రాంతాల నుంచి శుభవార్తలు. వాహనయోగం. భూవివాదాల పరిష్కారం. ఆస్తి విషయంలో ఒప్పందాలు. వృత్తి,వ్యాపారాలలో ముందడుగు వేస్తారు.

సింహం: పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక ఇబ్బందులు. రుణదాతల ఒత్తిడులు. మిత్రులతో వివాదాలు. వృత్తి,వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

కన్య: కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో ఆదరణ. వస్తు, వస్త్రలాభాలు. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

తుల: ఇంటర్వ్యూలలో విజయం. ఆప్తుల సలహాలు పాటిస్తారు. పాతమిత్రుల కలయిక. భూములు, వాహనాలు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూల వాతావరణం.

వృశ్చికం: రుణదాతల ఒత్తిడులు. అనుకోని ప్రయాణాలు. ఇంటాబయటా సమస్యలు. బంధువుల తాకిడి పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో చిక్కులు.

ధనుస్సు: శ్రమ తప్ప ఫలితం ఉండదు. పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. రాబడికి మించి ఖర్చులు అవుతాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

మకరం: మిత్రుల సలహాలు పాటిస్తారు. సంఘంలో గౌరవం. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. వస్తు లాభాలు. వృత్తి, వ్యాపారాలలో అనుకూలం.

కుంభం: గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. సభలు,సమావేశాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో పురోగతి.

మీనం: కొన్ని కార్యక్రమాలు హఠాత్తుగా విరమిస్తారు. శ్రమాధిక్యం. నిర్ణయాలు మార్చుకుంటారు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపారాలలో స్వల్ప లాభాలు. ఉద్యోగులకు నిరుత్సాహం.

– సింహంభట్ల సుబ్బారావు





ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ మోడల్ స్కూల్లో వాటర్‌ప్లాంట్ పనిచేయక రెండు నెలలైంది. ఐదు వందల మంది విద్యార్థులు ఇంటి నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నారు. వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 9440243048

ఆధార్‌కు అవస్థలు

అందుబాటులో లేని నమోదు కేంద్రం

- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న చిన్నారులు

ముస్తాబాద్: ఇప్పుడు దేశంలో అన్నింటికి ఆధారే ఆధారం. ఆధార్ లేని వ్యక్తి ప్రభుత్వ లెక్కల్లో లేనట్లే. బియ్యం పొందాలన్న, బ్యాంక్ అకౌంట్ కావాలన్న, పింఛన్లు తీసుకోవాలన్నా.. చివరకు ఓటు వేసేందుకు కూడా ఆధార్ నెంబర్ తప్పనిసరి. కానీ మండలంలో ఆధార్ నమోదు కేంద్రం కరువైంది. చిన్నారుల ఆధార్ నమోదు, మిగతావారు పేర్ల మార్పులు, చేర్పుల కోసం అవస్థల పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరు నెలలుగా కేంద్రం లేక పోవడంతో వారు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.

ఆరు నెలల క్రితం ముస్తాబాద్‌లోని ఆధార్ నమోదు కేంద్రం నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కేంద్రాన్ని సీజ్ చేశారు. అదే స్థాయిలో ఇంకోకరిని నియమించడంలో విఫలం అయ్యారు. దీంతో కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారికి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో ఆధార్ నమోదు కేంద్రం లేనిది ఒక్క ముస్తాబాద్ మండలం మాత్రమే.



ఆధార్ కేంద్రం లేక నమోదుకు దూరమైన చిన్నారులు

దూరభారం

స్థానికంగా ఆధార్ నమోదు కేంద్రం లేక.. కార్డుల్లో తప్పొప్పులు సరిచేసుకునేందుకు బాధితులు సిరిసిల్ల, సిద్దిపేటకు వెళ్తున్నారు. వారం రోజుల క్రితం ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కుమారుడికి ఆధార్ కార్డు తీసేందుకు ముంబాయి నుంచి స్వగ్రామం ముస్తాబాద్‌కు వచ్చాడు. తీరా ఇక్కడ కేంద్రం లేకపోవడంతో సిరిసిల్లకు వెళ్లి.. అక్కడ గంటల తరబడి వేచి ఉండి నమోదు చేయించుకున్నాడు. ఇక చిన్నారులకు అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారం కోసం ఆధార్ తప్పనిసరి. ఆధార్ నమోదు కోసం వెళ్లిన వారికి నిరాశే ఎదురవుతుంది. పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు ఇతర మండలాలకు వెళ్తున్నారు.

బీడీ కార్మికుల గోస

ఆధార్ నమోదు కేంద్రం లేక బీడీ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల క్రితం బీడీ కంపెనీలో నమోదయిన పేరు, పుట్టిన తేదికి ప్రస్తుత ఆధార్‌లోని వాటికి వ్యత్యాసం ఉంది. దీంతో కార్మికులకు వచ్చే కేంద్ర ప్రభుత్వ పింఛన్లు నిలిచిపోయాయి. బీడీ కంపెనీలో ఉన్నట్లుగానే పుట్టిన తేదీలను ఆధార్‌లో మార్చుకునేందుకు కార్మికులు సిరిసిల్లకు వెళ్తున్నారు.

అంగన్‌వాడీలో గుడ్లు ఇవ్వడం లేదు



మా కొడుకు నితీశ్ కోసం అంగన్‌వాడీకి వెళ్లి గుడ్లు, పాలు అడిగితే ఇవ్వలేదు. ఆధార్‌కార్డు లేకపోవడంతో వారు అన్నం పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. ఇక్కడెమో ఆధార్ నమోదు చేయడం లేదు. సిరిసిల్లకు వెళ్లామంటే ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. సార్లు ఇక్కడ ఆధార్ కేంద్రం పెట్టాలే.

– అనూజ, ముస్తాబాద్

అధికారులకు నివేదించాం



ఆధార్ కేంద్రం గతంలో ఉన్న వారిని తొలగించారు. కొత్తవారికి అవకాశం కల్పించాలని సంబంధిత అధికారులకు సమాచారం అందించాం. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మీసేవ ఉన్న వారెవరైనా వస్తే కేంద్రం ఇప్పిస్తాం.

– రమేశ్, తహసీల్దార్

న్యూస్ బాక్స్

వికలాంగుల పునరావాస కేంద్రం సందర్శన

సిరిసిల్లరూరల్: తంగళ్లపల్లిలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికలాంగుల పునరవాస కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ రవీందర్ బుధవారం సందర్శించారు. దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పునరవాస కేంద్రానికి శాశ్వత భవనం కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. డీపీఎం సుధారాణి, ఏపీఎం పవన్ ఉన్నారు.

బస్టాండ్ ఆధునీకీకరణకు నిధులు మంజూరు

ఎల్లారెడ్డిపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకీకరించడానికి ప్రభుత్వం రూ.11 లక్షలు మంజూరు చేసింది. పనులు చేపట్టడానికి జెడ్పీటీసీ ఆధ్వర్యంలో నాయకులు, ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించారు. మిగతా పనుల కోసం మరో రూ.10 లక్షల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. మూత్రశాలలు, మంచినీటి వసతి, ప్రయాణికులు కూర్చునే బల్లలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ డీఎం వెంకటరమణ, ఎంపీడీవో చిరంజీవి, ఏఎంసీ చైర్మన్ అందె సుభాష్, డీసీఎంఎస్ డైరెక్టర్ గుండారపు కృష్ణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్వహణకు ఆర్థిక చేయూత

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి బుధవారం రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుద్యోగులు, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగపురి నరేశ్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్ ఉన్నారు.

గ్రామాలాభివృద్ధే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ ఎలుసాని సుజాత అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న శ్మశానవాటికకు బుధవారం ఎంపీపీ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బుర్క భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ నలిమెల ప్రకాశ్, ఎలుసాని మోహన్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు హసన్, నిమ్మ మల్లారెడ్డి, మోతె నర్సింహారెడ్డి, ఏపీవో కొండయ్య పాల్గొన్నారు.

'నిరుద్యోగులను వంచిస్తున్న ప్రభుత్వం'

ముస్తాబాద్: నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న రాష్ట్రంలో.. టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను వంచిస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎంపెల్లి వంశీకృష్ణ అన్నారు. ముస్తాబాద్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ దీక్షను బుధవారం ఆయన ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేర్గు హన్మంత్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, సంతోష్‌రెడ్డి, బాద నరేశ్, కార్తీక్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, దేవేందర్, రాజశేఖర్, ఈరడి రాజు, శ్రీకాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేటలో బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఒక రోజు నిరుద్యోగ దీక్ష చేపట్టారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. బీజేవైఎం, బీజేపీ మండల అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, దేవసాని కృష్ణ, నాయకులు చంద్రయాదవ్, శ్రావణ్‌యాదవ్, స్వామి, పత్తిస్వామిరాజ్, కోదండం మహేశ్, అర్జున్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ముస్తాబాద్: మాట్లాడుతున్న వంశీకృష్ణ

లోకల్ వాయిస్

వేతనాలివ్వాలి

ముస్తాబాద్: గ్రామాల్లో కోతుల నివారణకు వినియోగిస్తున్న కొండముచ్చుల నిర్వాహకులకు వేతనాలు ఇవ్వాలి. ఊర్లోకి కోతులు రాకుండా కొండముచ్చులతో పహారా కాస్తున్నాం.ప్రజలెవరైనా దయతలిస్తేనే కొంత డబ్బు వస్తుంది. వేతనాలిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.



– కొమ్మెట రాజుఎల్లయ్య, తెర్లుమద్ది

అక్రమ పట్టాలపై విచారణ

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మండలం కంచర్లలో 20 ఎకరాల రెవెన్యూ, అటవీ భూములను అక్రమ పట్టాలు చేయడంపై తహసీల్దార్ విజయలలిత బుధవారం విచారణ చేపట్టారు. కంచర్ల గ్రామస్తులతో తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపించారు. కంచర్లలో సర్పంచ్ కట్కూరి రాజుతో పాటు మరో నలుగురు 11ఎకరాలు అక్రమంగా పట్టాలు చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రంగంపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ పంబాల హన్మండ్లు మరో 9 ఎకరాలు అక్రమంగా పట్టా చేయించుకున్నాడు. దీనిపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ విచారణ చేపట్టారు.

దుస్తులు అందజేత

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన దీటి నవ్య తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోయి అనాథగా మారింది. దీంతో బీఎస్పీ మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య ఆమెకు దుస్తులు, పుస్తకాలను బుధవారం అందజేశారు.

పుత్రకామేష్టి యాగం



యాగంలో పాల్గొన్న దంపతులు

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని సువిజ్ఞాన ఆశ్రమంలో బుధవారం వ్యవస్థాపకులు ఆచార్య సత్యవీర్స్వామీజీ ఆధ్వర్యంలో పుత్రకామేష్టి యాగం నిర్వహించారు. పుష్యమాసంలో పుష్యమీ నక్షత్రం నాడు ఈ యాగం చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. యాగంలో 45 మంది దంపతులు పాల్గొన్నారని చెప్పారు. అనంతరం వారికి యోగాసనాలు, ప్రాణాయామం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. యాగం నిర్వహణలో స్వామీజీతోపాటు, యోగా సిద్ధిరాములు పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 9248828666లో సంప్రదించవచ్చని సూచించారు. యాగం మళ్లీ ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పంటల హబ్‌గా తెలంగాణ

- లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.247కోట్లు నాబార్డ్‌తో రుణం
- రాష్ట్రంలో 1350 ఎకరాల పాలిహౌస్ సాగు
- హార్టికల్చర్ కమిషనర్ వెంకట్ రామిరెడ్డి



బీరకాయ పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ కమిషనర్ వెంకట్ రామిరెడ్డి

సుల్తానాబాద్: పసుపు, మిర్చి విదేశాలకు సరఫరా చేసే స్థాయికి తెలంగాణ చేరిందని హార్టికల్చర్ కమిషనర్ వెంకట్ రాంరెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో పాలిహౌస్ ఏర్పాటు చేసిన రైతు సుగుణాకర్ క్షేత్రాన్ని బుధవారం పరిశీలించారు. తెలంగాణ పంటల హబ్‌గా ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు.

వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలో సాగవుతున్న పసుపు, మిర్చి పంటలను అరబ్ దేశాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మైక్రోఇరిగేషన్ ద్వారా సాగుకు(లిఫ్ట్ ఇరిగేషన్) రూ.247కోట్లు రుణం తీసుకొని రైతులకు అందిస్తున్నామన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో ఈ పథకాన్ని ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. ఆధార్‌కార్డు తోపాటు పట్టాదారు పాసుపుస్తకంతో దరఖాస్తు చేసుకుంటే మూడు నెలల్లోగా రైతుల సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు వస్తాయన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్ష 25వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 1350 ఎకరాల్లో పాలిహౌస్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 95శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. హైదరాబాద్ చుట్టూపక్కల ప్రాంతాల్లోని రైతులు పూలతోటల సాగుతో రూ.లక్ష వరకు ఆదాయం గడిస్తున్నారన్నారు. సక్రమంగా పనిచేయని హార్టికల్చర్ ఏపీడీ జ్యోతి నెల వేతనం నిలుపుదల చేసి రైతు సుగుణాకర్‌కు అందివ్వాలని సూచించారు. ఏడీహెచ్ మదుసూధన్, డీడీహెచ్ బండారి శ్రీనివాస్, డీడీవో దేవేందర్‌రావు, ఏపీడీ జ్యోతి, హెచ్‌వోలు శ్యామ్, జ్యోతి, శ్రీకాంత్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

వేములవాడ: వేములవాడ, గంగాధర ప్రాంతాల రైతులకు ఎల్లంపల్లి ద్వారా సాగునీరందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేదని, ఇందుకు క్రాప్‌హాలిడేగా ప్రకటించి రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం రాజన్నను దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. వేములవాడకు వచ్చే రైతులకు కనీసం తాగునీరు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. మాటల గారడితో ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని హితవుపలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఉన్నారు.

ఎస్సారార్ విద్యార్థి నరేశ్ జేఆర్‌ఎఫ్‌కు ఎంపిక



నరేశ్(ఫైల్)

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల ఎంఏ తెలుగు విద్యార్థి నరేశ్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిర్వహించిన పరీక్షలో జేఆర్‌ఎఫ్(జూనియర్స్ రీసెర్చ్ ఫెలోషిప్)కు ఎంపికైనట్లు కళాశాల తెలుగు విభాగం అధిపతి కొత్తిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. యూజీసీ గత నవంబర్‌లో పరీక్షలను నిర్వహించగా మంగళవారం ఫలితాలు విడుదలయ్యాయి. నెట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జేఆర్‌ఎఫ్‌కు ఎంపికచేస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పరిశోధనలు చేయడానికి మూడేళ్లకాలానికి గాను నెలకు రూ.32,500 ఫెలోషిప్, చివరి సంవత్సరం సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు నెలకు రూ.35,750 చెల్లిస్తుందని తెలిపారు. దీంతో పాటు ఏటా కాంటిజెన్సి కూడా చెల్లిస్తుందని వివరించారు. నరేశ్ ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ నితిన్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళా ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు పోటీలు



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు

రామగుండం: ఈనెల 9 నుంచి 12 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి మహిళా తెలంగాణ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ముందస్తుగా ఎంపిక కసరత్తు రామగుండంలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం రామగుండంలో జెన్‌కో గ్రౌండ్‌కు కరీంనగర్, పెద్దపల్లి, మంథని, రామగుండం ప్రాంతాలకు చెందిన మహిళా ఫుట్‌బాల్ టీంలకు పోటీలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేయనున్నారు. క్రీడాకారులను రామగుండం జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ పోటీల్లో సుమారు 50 మంది మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల నిర్వహణలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుల పోశం, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, అసోసియేషన్ కార్యదర్శి గణపతి, ఉపాధ్యక్షుడు నాయుడు, కోశాధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌లీగల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఐదు న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడీషియల్ సెకాండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉద్యోగాల భర్తీకి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బుధవారం నోటిఫికేషన్ జారీచేశారు. కరీంనగర్, హుజూరాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడీషియల్ సెకాండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉద్యోగాలకు ఫిబ్రవరి 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఐదేళ్లపాటు విధులు నిర్వర్తించి 45 యేళ్లు పైబడి ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో లేనివారు, న్యాయవాద పట్టా గల విశ్రాంత గెజిటెడ్ అధికారులు, పబ్లిక్‌సరీవ్స్ కమిషన్ నిర్వహించిన క్రిమినల్ జ్యుడీషియల్ టెస్ట్‌లో ఉత్తీర్ణులై 65యేళ్లు దాటని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన మెజిస్ట్రేట్‌లు 65 ఏళ్ల వయస్సు వచ్చే వరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ సాహితీ గౌతమి ఆధ్వర్యంలో ఏటా ప్రదానం చేసే చింతల లక్ష్మారెడ్డి స్మారక రాష్ట్రస్థాయి పురస్కారానికి 2017 సంవత్సరానికి గాను మహిళా కథకుల నుంచి కథా సంకలనాలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కార కమిటీ కన్వీనర్ సీహెచ్.సంపత్, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దాస్యం సేనాధిపతి, గాజుల రవీందర్ తెలిపారు. 2015, 2016, 2017 సంవత్సరాలలో వెలువరించిన కథా సంకలనాల నాలుగు ప్రతులను ఈనెల 25లోగా పంపించాలన్నారు. పురస్కారం కింద రూ.5వేల నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9440525544లో సంప్రదించాలని సూచించారు.



'స్వచ్ఛత'పై సర్వే

రాష్ట్రంలో పర్యటించనున్న కేంద్ర బృందం

మున్సిపాలిటీల్లో స్వచ్ఛ భారత్ కింద చేపడుతున్న కార్యక్రమాల ఆధారంగా ర్యాంకులు ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించింది. మెరుగైన ర్యాంకు సాధిస్తే కేంద్రం చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం'లో చోటు కల్పిస్తారు. జనవరి 4వ తేదీ నుంచి దేశంలోని అన్ని మున్సిపాలిటీలను కేంద్ర బృందాలు పరిశీలించి ర్యాంకులివ్వనున్నాయి. తెలంగాణలో పర్యటించనున్న బృందం 73 మున్సిపాలిటీల్లో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించనుంది.

- వికారాబాద్ నుంచి కొలను దివాకర్‌రెడ్డి

స్వచ్ఛత సాధిస్తే నిధులు..

"స్వచ్ఛత సాధిస్తే మున్సిపాలిటీలకు దండిగా నిధులను విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలో జాతీయ స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ 18వ ర్యాంకు, వరంగల్ మున్సిపాలిటీ 33వ ర్యాంకు సాధించాయి. ఇదే విధంగా లక్షలోపు జనాభా ఉన్న మున్సిపాలిటీలను స్వచ్ఛ సర్వేక్షణకు ఎంపిక చేస్తారు. దీంతో ఆ మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య, స్వచ్ఛత పనులు, ప్లాస్టిక్ నిషేధం తదితర పనులను బట్టి ర్యాంకులను ప్రకటిస్తారు. అనంతరం నిధులను విడుదల చేస్తారు.

వచ్చేస్తోంది కేంద్ర బృందం..

గతంలో లక్ష జనాభాకుపైగా ఉన్న మున్సిపాలిటీలకే సర్వేక్షణ్ పథకాన్ని పరిమితం చేయాలని భావించారు. కానీ ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ జనవరి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అమలులోకి వచ్చింది. దేశంలో మొత్తం 4,041 మున్సిపాలిటీలను కేంద్ర అధికారుల బృందం పరిశీలించనుంది. తెలంగాణలో 73 మున్సిపాలిటీలను పరిశీలించనున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. పనితీరు మెరుగ్గా కన్పిస్తేనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చోటు లభించనుంది.

ఊపందుకున్న పనులు..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు పక్షం రోజులుగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. చెత్త తొలగింపుతోపాటు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో మొత్తం 15 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తారు. ఒక్కో మున్సిపాలిటీకి 4000 మార్కులను కేటాయించారు. 1400 మార్కులు పారిశుద్ధ్యం, 1400 మార్కులు పౌర సేవలు, 1200 మార్కులు రికార్డుల నిర్వహణకు కేటాయించారు.

కేంద్రం పర్యటించే మున్సిపాలిటీలు

గ్రేటర్ హైదరాబాద్, ఆదిలాబాద్, భూపాలపల్లి, జనగామ, కాగజ్‌నగర్, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్, వరంగల్ అర్బన్, వనపర్తి, యాదాద్రి భువనగిరి మున్సిపాలిటీలతో పాటు గద్వాల జిల్లాలో రెండు, జగిత్యాలలో నాలుగు, కరీంనగర్ జిల్లాలో మూడు, ఖమ్మం జిల్లాలో మూడు, కొత్తగూడెం జిల్లాలో నాలుగు, మంచిర్యాలలో మూడు, మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు, మేడ్చల్‌లో మూడు, నిర్మల్‌లో రెండు, నాగర్‌కర్నూలు జిల్లాలో నాలుగు, నల్లగొండ జిల్లాలో మూడు, నిజామాబాద్ జిల్లాలో మూడు, పెద్దపల్లిలో రెండు, రంగారెడ్డి జిల్లాలో ఏడు, సిరిసిల్లలో రెండు, సిద్దిపేటలో నాలుగు, సంగారెడ్డిలో ఐదు, సూర్యాపేటలో మూడు, వికారాబాద్‌లో రెండు మున్సిపాలిటీలను కేంద్ర బృందం పరిశీలించనుంది.

పరిశీలించే అంశాలు..

మున్సిపాలిటీలలో తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా.., వాణిజ్య ప్రాంతాల నుంచి చెత్తను సేకరిస్తున్నారా.., చెత్త నుంచి కంపోస్టు తయారీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా.., పాఠశాలల్లో స్వచ్ఛత కమిటీల పరిస్థితి, బహిరంగ మల, మూత్ర విసర్జన వంటి అంశాలను కేంద్ర బృందం పరిశీలిస్తుంది. పరిశుభ్రత సందేశాల ఏర్పాటు, వ్యర్థాల శుద్ధి, ప్రతి 500 మీ.లకు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, పెట్రోల్ బంకుల్లో టాయిలెట్ల ఏర్పాటు తదితర అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటారు.

ఉపాధి 'కల్పన'




- ఎంప్లాయ్‌మెంట్ కార్డుపై నిరుద్యోగుల నిరాసక్తి
- యేటేటా తగ్గిపోతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య
- రెన్యూవల్ చేసుకోకపోవడంతో లక్షల్లో రిజిస్ట్రేషన్లు తొలగింపు
- ల్యాప్స్ కార్డుల పునరుద్ధరణకు ముగిసిన గడువు

ఆదిలాబాద్ నుంచి గొడిసెల కృష్ణకాంత్ గౌడ్ :


నోటిఫికేషన్లు లేవు.. కాల్ లెటర్లు రావు.. ఎంప్లాయ్‌మెంట్ కార్డుతో ప్రయోజనం లేదన్న నిరాసక్తత నిరుద్యోగుల్లో కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ శాఖ 'ఉత్తదే' అన్న అభిప్రాయం నిరుద్యోగుల్లో నెలకొంది. కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఇప్పటివరకు లక్షల్లో రిజిస్ట్రేషన్లను తొలగించారు. ప్రభుత్వం 2000 సంవత్సరం నుంచి ల్యాప్స్ అయిన కార్డుల పునరుద్ధరణకు గత నెల 31 వరకు అవకాశం ఇచ్చింది. అయినా చాలా మంది పునరుద్ధరించుకోలేదు. మొత్తంగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ వ్యవస్థపై నమ్మకం సడలుతోంది.

జిల్లాకో ఉపాధి కల్పన శాఖ..

పాత జిల్లాల్లో ఒకట్రెండు ఉపాధి కల్పన శాఖ కార్యాలయాలుండేవి. జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో నిరుద్యోగుల సమాచారం నిక్షిప్తం చేసేవారు. ఏజెన్సీ, ఐటీడీఏ ప్రాంతాల్లో ఉపాధి కల్పన శాఖ కార్యాలయాలు ఇప్పటికీ పని చేస్తున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ప్రతి జిల్లాకు ఒక కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొత్త రిజిస్ట్రేషన్లతో పాటు రెన్యూవల్స్ ప్రక్రియ జరుగుతోంది. రెండు, మూడేళ్ల కోర్సులు చేసినవారు జిల్లా శాఖలో, నాలుగేళ్ల పైబడి కోర్సులు చేసిన వారు హైదరాబాద్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేసుకోవాలి. సింగరేణి ఉద్యోగాల నియామకాలు, వారసత్వ ఉద్యోగాలకూ ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ కార్డును పరిగణనలోకి తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇతర ఉద్యోగాలకూ ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే తప్ప రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగే అవకాశం లేదు.



గత మూడేళ్లుగా లాప్స్ అయిన రిజిస్ట్రేషన్లు..



నామమాత్రంగా ప్లేస్‌మెంట్లు..

ఉపాధి కల్పన శాఖ ద్వారా ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ప్లేస్‌మెంట్ల కోసం సెప్టెంబర్ వరకు 2107 నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఒక్క పోస్టుకు 1:20 చొప్పున 14,081 మంది నిరుద్యోగుల జాబితాను పంపించగా 158 మందికే ఉద్యోగావకాశాలు దక్కాయి. 2016లో 888 మందికి, 2015లో 503 మందికి ఉద్యోగాలొచ్చాయి. ఇంతకు ముందు 10వ తరగతి కాగానే ఎంప్లాయ్‌మెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ఆ తర్వాత విద్యార్హతలు పెరిగిన కొద్దీ ఆ కార్డులో నమోదు చేసుకోవడం, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గడువు ముగియక ముందే రెన్యూవల్ చేసుకోవడం జరిగేది. అప్పట్లో పలు ఉద్యోగాల నోటిఫికేషన్లు ఎంప్లాయ్‌మెంట్ శాఖ ద్వారానే వచ్చేవి. ఇప్పుడు నోటిఫికేషన్ల సమాచారం, కాల్ లెటర్లు లేకపోవడంతో పరిస్థితులు మారిపోయాయి. మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతుండడంతో ఈ ప్రక్రియను ఎవరూ పట్టించుకోవడం లేదు.



పన్ను మినహాయింపునకు

ఉత్తమమార్గాలు

ప్రయోజనం..

జ్యోతినగర్(రామగుండం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18) ముగింపునకు వచ్చేస్తోంది. ఆదాయపన్ను పరిధిలోకి వచ్చే వారంతా ఇప్పటికే చాలావరకూ పన్ను మినహాయింపులకు పెట్టుబడి పెట్టి ఉండాలి. వేతనజీవులు పన్ను ప్రణాళికను ఇప్పటినుంచే వేసుకోవాలి. దీంతో అసలు పన్ను లేకుండా/తక్కువ పన్నుతో రిటర్నులను ఫైల్ చేయవచ్చు. ఇలా వేతన ఉద్యోగులకు పన్ను మినహాయింపు పొందేందుకు ఉన్న పలు మార్గాలున్నాయి. అవి...

పిల్లల చదువుల ఫీజులు..

చదువులు ఖరీదైపోయాయి. పిల్లల ఫీజులు లక్షల్లో చెల్లిస్తున్నారు. ట్యూషన్ ఫీజుకు సంబంధించి ఆదాయపు పన్నుశాఖ మినహాయింపు నిస్తుంది. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపునకు క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇంటి అద్దె పన్ను మినహాయింపు

కంపెనీ వసతి కల్పించకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నవారికి పన్ను మినహాయింపు పొందవచ్చు.

- మీ మొత్తం ఆదాయంలో ఏది తక్కువైతే దానికి మినహాయింపు పొందవచ్చు.
- యాజమాన్యం ఇస్తున్న హెచ్ఆర్ఏ
- బేసిక్ శాలరీలో 40 శాతం+డీఏ
- చెల్లించిన ఇంటి అద్దె, 10 శాతం బేసిక్ శాలరీ+డీఏ

గృహ రుణం చెల్లింపు ద్వారా..

సొంత ఇంటి కోసం బ్యాంకులో అప్పు తీసుకుంటే చెల్లించే ఈఎంఐల ద్వారా పన్ను తగ్గించుకోవచ్చు. చెల్లించే అసలు, వడ్డీకి సంబంధించి వాయిదాల్లో కొంత వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. వడ్డీకి సెక్షన్ 24 కింద, చెల్లించే అసలుకు 80సీ కింద మినహాయింపు పొందొచ్చు. కొత్తగా ఇంటిని కొంటున్నట్లయితే/మొదటిసారి కొన్న గృహ రుణం చెల్లిస్తున్నట్లయితే ఎక్కువ మొత్తంలో పన్ను ఆదా చేసుకోవచ్చు.

విద్యారుణ ఈఎంఐలు..

ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారు. ట్యూషన్ ఫీజులకు పన్ను మినహాయింపున్నట్లే విద్యారుణానికి చెల్లించే ఈఎంఐలకు సైతం పన్ను మినహాయింపు ఉంటుంది.

విహారయాత్రల ఖర్చులు..

మీకు వచ్చే వేతనం పన్ను మినహాయించే వాటిలో ఎల్టీసీ కూడా ఉంటుంది. ఎల్టీసీ బ్లాక్ ఇయర్ 2014– 17 మధ్య ఉంది. నాలుగేళ్లలో రెండు సార్లు ఎల్టీసీఏ లేదా ఎల్టీసీ మినహాయింపు పొందవచ్చు. యాజమాన్యం ఇచ్చిన ఎల్టీసీఏ ఖర్చుల మేరకు పన్ను మినహాయింపులకు క్లయిం చేయొచ్చు.

వైద్య ఖర్చులు..

వైద్య ఖర్చులు నిత్య జీవితంలో వెచ్చించే ఖర్చుల్లో భాగమైంది. దీని నుంచి స్వాంతన పొందేందుకు ఆరోగ్య బీమా, ముందస్తు వైద్య పరీక్షలకు సంబంధించి అయ్యే ఖర్చులను పన్ను మినహాయింపు కింద చూపించొచ్చు. ఈ విధంగా రూ.60 వేల వరకు మినహాయింపు పొందొచ్చు.

జీవిత బీమా..

పెట్టుబడి కోణంలో కాకుండా రిస్క్ కవరేజ్ కలి ్పంచేందుకు ఉపయో గపడే జీవిత బీమా సైతం ఆదాయ పన్ను మినహాయింపు కోసం అర్హత కలిగి ఉంది. సెక్షన్ 80సీ కింద కట్టే ప్రీమియంకు సంబంధించి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు కోరవచ్చు.

ఈపీఎఫ్..

పలు కంపెనీలు ఉద్యోగులకు పీఎఫ్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. పీఎఫ్ రూపంలో వేతనంలో మినహాయించే ధనాన్ని 80సీ కింద మినహాయింపు చూపించొచ్చు.

పీపీఎఫ్..

ఈపీఎఫ్ కాకుండా తక్కువ రిస్క్ తీసుకుంటూ దీర్ఘకాల పొదుపు చేయాలనుకునే వారికి పీపీఎఫ్ మరో మార్గ. పదిహేనేళ్ల పాటు మీ పెట్టుబడులను కొనసాగించవచ్చు. ఇది ఒక సంప్రదాయ పెట్టుబడి మార్గం. దాదాపు 8 శాతం వడ్డీ లభిస్తుంది. గరిష్టంగా ఏడాదికి రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి పెట్టవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన

కూతురి పేరిట డబ్బు పొదుపు చేసేందుకు ఉపయోగపడేది సుకన్య సమృద్ధి యోజన పథకం. తపాలా కార్యాలయం, బ్యాంకుల్లో ఈ పథకం ఖాతా తెరవవచ్చు. ఈ పథకంలో పెట్టే పెట్టుబడికి పన్ను మినహాయింపు ఉంది.

కల్లాపి: సిరిసిల్లలో వాకిట్లో కల్లాపి చల్లు తున్న వృద్ధురాలు





ప్యాకెట్ ఓకే: పెద్దపల్లిలో పాలప్యాకెట్ల వద్ద సందడి..



పొలంబాట: పెద్దపల్లిలో కాడెడ్లతో పొలానికి వెళ్తున్న రైతు



కూరగాయలో....: పెద్దపల్లిలో కూరగాయలతో వృద్ధుడు





తెల్లా



మార్కెట్ సందడి: పెద్దపల్లి హోల్‌సేల్ మార్కెట్లో చిరు వ్యాపారుల రద్దీ



హెల్దీవాక్: మార్నింగ్ వాక్‌లో సిరి



పేపర్.. పేపర్: పెద్దపల్లిలో పేపర్ వేసేందుకు వెళ్తున్న బాలుడు



క్లీనింగ్: పెద్దపల్లిలో మున్సిపల్ కార్మికుల ముచ్చట్లు



వన్, టూ : పెద్దపల్లిలో వ్యాయామం చేస్తున్న వాకర్స్



పిన్నీసులో..: సిరిసిల్లలో ప్లాస్టిక్ సామగ్రి విక్రయించేందుకు వస్తున్న మహిళ



గరంగరం: పెద్దపల్లి చాయ్‌వాలా దుకాణం వద్ద ఛాయ్‌కోసం...



చలిమంట: సిరిసిల్లలో చలిమంట కాగుతున్న ప్రజలు

రిందోయ్..



ఏం జరుగుతోంది..?: పెద్దపల్లిలో సాక్షి పేపర్ చదువుతూ...



ల్ల వనితలు..

నిన్న అనేది గడిచిపోయింది..

నేటికి సమయం ఆసన్నమైంది..

ఎముకలు కొరికే చలి భయపెడుతున్నా..

మంచు దుప్పట్లో పల్లె వెచ్చగా నిద్రిస్తోంది..

చీకటిని చీల్చుకుంటూ భానుడు రాకముందే..

చలిమంటలను చేతుల్లో బంధించి..

వణుకును ఒక్క ఛాయ్‌తో తరిమేసి..

జనం పనిబాట పడుతున్నారు..

కర్షకులు పట్టణం వైపు వస్తున్నారు..

ఈ రోజుకు శుభోదయం పలుకుతున్నారు..

ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగిపోతోంది. ఉదయం 7 గంటలు అయితే కానీ పక్కలోనుంచి లేవాలనిపించని పరిస్థితి. ఇలాంటి చలిలో కొందరు నిశిరాత్రి యోధులు వేకువజామున్నే నిద్రలేచి వారివారి విధుల్లో బిజీబిజీగా మారారు. పట్టణాల్లో పాలు, పేపర్ వేసేవాళ్లు, హోటళ్ల యజమానులు, పారిశుధ్య కార్మికులు ఎముకలు కొరికే చలిలోనూ వారివారి పనుల్లో నిమగ్నమవుతున్నారు. మంచు దుప్పటిని చీల్చుకుంటూ పల్లె కర్షకులు పట్టణబాట పడుతున్నారు. పాలు, కూరగాయలు తీసుకొచ్చి వేకువజామున్నే పట్టణాల్లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. చలికి తట్టుకోలేక వీధుల్లో చలిమంటలు కాగుతున్నారు. ఇంటి ఆడపడుచులు ముంగిళ్లను సింగారిస్తుంటే.. రైతులు కాడెడ్లతో పొలంబాట పడుతున్నారు. చలి తీవ్రత దృష్ట్యా పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల ప్రాంతాల్లో వేకువజామున 'జనసందడి'ని 'సాక్షి' తన కెమెరాల్లో బంధించింది.

ఫొటోల సేకరణ :
మర్రి సతీశ్‌కుమార్, పెద్దపల్లి ఫొటోగ్రాఫర్
వంకాయల శ్రీకాంత్, సిరిసిల్ల ఫొటోగ్రాఫర్



శరణం అయ్యప్ప: పెద్దపల్లి అయ్యప్ప ఆలయంలో భక్తులు

మిగిలింది రెండు రోజులే..!

6 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

- ఇంకా మొదలుకాని ఏర్పాట్లు
- కొలిక్కిరాని కళాకారుల ఎంపిక
- నిర్వహణపై అనుమనాలు?


త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో కచేరీ(ఫైల్)

వేములవాడ: త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే రాజన్న ఆలయ అధికారులు ఈయేడు మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈనెల 6 నుంచి 10 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ.. కార్యక్రమాల వివరాలు, కళాకారుల ఎంపిక, ఆహ్వానపత్రికల ముద్రణ ఇంకా కొలిక్కిరాలేదు. మిగిలిన ఒక్క రోజులోనే ఇవన్నీ జరగడం అసాధ్యమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా రాజన్న ఆలయ అధికారుల ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలు.. ప్రస్తుతం రాష్ట్ర సాంస్కృతికశాఖ సైతం నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. రెండు శాఖల అధికారుల సమన్వయలోపం వేడుకలపై ప్రభావం చూపేలా ఉంది. అసలు ఉత్సవాలు నిర్వహిస్తారా?లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

సాంస్కృతికశాఖ ప్రమేయం

వేములవాడ రాజన్న సన్నిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన 64 త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను ఆలయ అధికారుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈసారి రాష్ట్ర సాంస్కృతికశాఖ సైతం నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. ఆలయ అధికారులు, సాంస్కృతికశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో ఎక్కువమంది కళాకారులకు అవకాశాలు లభించకపోవచ్చనే సందేహాలు కలుగుతున్నాయి. ఏటా వందకు పైగా కార్యక్రమాలు, రాష్ట్రంలోని మేటి కళాకారులను ఆహ్వానించి సంగీత, శాస్త్రీయి, నృత్య, నాటక, భక్తి, హరికథ కార్యక్రమాలు నిర్వహించేవారు.

65 ఏళ్లుగా ఉత్సవాలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో 65 ఏళ్లుగా నాదబ్రహ్మ, లయబ్రహ్మ, సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. చవుటు సాంబయ్యశాస్త్రి స్ఫూర్తితో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. 1951లో తిరువయ్యూర్‌కు వెళ్లి ఉత్సవాలను తిలకించిన సాంబయ్యశాస్త్రి ఆ మరుసటి సంవత్సరమే వేములవాడ క్షేత్రంలోఆరాధనోత్సవాల నిర్వహణకు శ్రీకారంచుట్టారు. అనంతరం ఆర్థిక సమస్యలు ఎదురైన విరాళాలు సేకరించి కళోత్సవాలు కొనసాగించారు. స్థానికులు, కళాకారుల కోరికతో 1961 నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు

ఎల్లలు లేని సంగీతం

సంగీతానికి ఎల్లలు లేవు అంటారు. పండిత పామరులను ఓలలాడించే శక్తి సంగీతానికి ఉంది. నాదోపాసన ద్వారా మోక్షప్రాప్తిని పొంది సంగీతానికి జీవితం అర్పించి రాగాలలో, కీర్తనలలో ఐక్యమైపోయిన సంగీత విద్యాంసుడు త్యాగయ్య. నాదరచనకు ఆధ్యుడైన నాదబ్రహ్మ, లయబ్రహ్మ అయిన శ్రీత్యాగరాజు జీవన విధానం అతి సామాన్యం...ఆదర్శనీయం. త్యాగయ్య ఇంటిపేరు కాకర్లవారు. కాకర్ల అనే గ్రామం నేటికీ ప్రకాశం జిల్లా కంభం మండలంలో ఉంది. వీరు మూలికనాటిశాఖకు చెందిన తెలుగు వైదిక బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వారు. క్రీస్తుశకం 1600 ప్రాంతంలో కాకర్ల నుంచి తంజావూరు ప్రాంతానికి వలసవెళ్లి తమిళనాడులో స్థిరపడ్డారు.

వేడుకల్లో సుప్రసిద్ధులు

1966లో సుప్రసిద్ధగాయకుడు ఘంటసాల, ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, రామకృష్ణ, పీబీ శ్రీనివాస్, ఆనంద్, శోభరాజ్, వేదవతి ప్రభాకర్, బాలకృష్ణ ప్రసాద్, గీతామాధురి, సునీత తమ గానంతో అలరించారు. కూచిపూడి నృత్యానికి ఆధ్యులు వేదాంతం సత్యనారాయణ, రాధేశ్యాం, ప్రపంచ మాండలిన్ మాంత్రికులు శ్రీనివాస్, గాయని జిక్కి, సినీనటి జమున ఈ ఉత్సవాలకు శోభ తెచ్చారు.

కొండగట్టులో కార్డన్‌సెర్చ్

- పోలీసుల అదుపులో అనుమానితులు
- 31 బైక్‌లు స్వాధీనం


అనుమానితులను విచారిస్తున్న ఎస్పీ అనంతశర్మ

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా దిగువ కొండగట్టులో బుధవారం కార్డన్‌సెర్చ్ చేపట్టారు. జగిత్యాల డీఎస్పీ భద్రయ్య ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు. అనుమానాస్పదులు 13 మందిని అదుపులోకి తీసుకోగా, ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా లేని 31 బైక్‌లు, 2 ఆటోలు, ఒక జీపు, 2 కార్లు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుట్కాప్యాకెట్లను పట్టుకున్నారు. వాహనాలు, అనుమానాస్పదుల నుంచి ఎస్పీ అనంతశర్మ ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరూ సంచరిస్తే వెంటనే 8332821100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకే తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో కొత్తవారు వచ్చి ఉంటే వెంటనే సర్పంచ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఏఆర్ డీఎస్పీ ప్రతాప్, జగిత్యాల సీఐ శ్రీనివాసచౌదరి, మల్యాల ఎస్సై రవి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

- ఎన్నికల హామీలు బుట్టదాఖలు
- పీసీసీ అధికార ప్రతినిధి ప్యాట రమేశ్


మాట్లాడుతున్న ప్యాట రమేశ్

కరీంనగర్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని పీసీ సీ అధికార ప్రతినిధి ప్యాట రమేశ్ విమర్శిం చారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను బుట్టదాఖలు చేసిన టీఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. విద్య, వైద్యరంగాలను విస్మరిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లకు ప్ర జాధనాన్ని దోచి పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆ గ్రహం వ్యక్తం చేశారు. రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తున్నామని గొ ప్పలు చెప్పుకోవడం టీఆర్‌ఎస్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్సార్ హయాంలోనే ఉచిత కరెంట్‌తోపాటు రైతు రుణమాఫీ ఏ కకాలంలో చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దిండిగాల మధు, బాశెట్టి కిషన్, వీరారెడ్డి, ఎలగందుల మునీందర్, తాళ్లపల్లి అంజయ్యగౌడ్, కటుకం కృష్ణ, దాసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్పుతోనే ఆరోగ్యమైన జీవితం



మాట్లాడుతున్న డాక్టర్ అమరేశ్‌రెడ్డి

కరీంనగర్‌హెల్త్: కాలానికనుగుణంగా జీవన విధానం మార్చుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపొచ్చని కరీంనగర్ మ్యాక్స్‌క్యూర్ ఆసుపత్రి ఎం డోక్రైనాలజిస్ట్ అమరేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పో లీస్‌హెడ్ క్వార్టర్స్‌లోని జాన్‌విల్సన్ మెమోరియల్ హాల్‌లో సీపీ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిం చిన పునరాకృతి సదస్సులో 'జీవన విధానం–ఆహారపు అలవాట్లు' అనే అంశంపై అమరేశ్‌రెడ్డి ఉపన్యసించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, క్యాన్సర్ వంటివి మనిషిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. వాతావరణంలో మార్పులను గమనిస్తూ ఆహారపు అలవాట్లు సరిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు వెంకటరమణ, ఉషారాణి, సీఐలు శ్రీనివాసరావు, మహేష్‌గౌడ్, విజయ్‌కుమార్, మ్యాక్స్ క్యూర్ అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్ పాల్గొన్నారు.

ఓం నమఃశివాయ


శివదీక్షలు స్వీకరిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న అర్చకులు


మాజీ మంత్రి బసవరాజు సారయ్యకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ: వేములవాడ రాజన్న క్షేత్రంలో ఫిబ్రవరి 13న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు 41 రోజుల ముందుగా చేపట్టే శివదీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి కళాభవన్‌లో దాదాపు రెండు వందల మంది శివదీక్షాపరులు మాలధారణ చేశారు. స్వాములు శివుడి అనుగ్రహం కోసం నిరంతర సేవలో పాల్గొంటారని అర్చకులు తెలిపారు. గురుస్వాములు వాసాలమర్రి గోపు, భీమన్న, రంగారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 21 రోజులు అర్ధమండల దీక్షలు ఫిబ్రవరి 22 నుంచి చేపడతారని గురుస్వాములు తెలిపారు. దీక్షలు చేపట్టే స్వాములు ఉదయత్పూర్వం స్నానమాచరించి శివుని నిత్య పూజ చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం ప్రదోషపూజ అనంతరం అల్పాహారం తీసుకోవాలని సూచించారు. వేములవాడ రాజన్నను బుధవారం మాజీ మంత్రి బసవరాజు సారయ్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి కుటుంబం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకుంది.

నాన్నా చెప్పవా

మనిషి కన్నా జీర్ణ వ్యవస్థ పొడవుగా ఎందుకుంటుంది?




చిన్న చిన్న పురుగులు, వాన పాముల్లాంటి జీవుల జీర్ణవ్యవస్థకు సంబంధించిన నాళాలు నోటి నుంచి పాయువు దాకా, దాదాపుగా ఆ జీవులంత పొడవుంటాయి. కాని పెద్ద పెద్ద జీవుల్లో మాత్రం వాటి జీర్ణవ్యవస్థ వాటి శరీరపు పొడవుకన్నా ఎన్నో రెట్లు పొడవుగా గాని లేదా ఉపరితల వైశాల్యంలో చాలా విశాలంగా గాని ఉంటుంది. ఉదాహరణకు ఒక మనిషి పొడవు కన్నా 'అన్నవాహిక – కడుపు సంచి – చిన్న పేగులు– పెద్ద పేగుల' తో కూడిన అతని జీర్ణవ్యవస్థ 10–12 రెట్లు ఎక్కువ పొడవుగా వుంటుంది. దాని పొడవు సుమారు 10 మీటర్లకు పైగానే వుంటుంది. ఎందుకు ఇలా ఉంటుందో స్పష్టంగా అర్థం కావాలంటే ముందుగా ఒక చిన్న పురుగు మనిషంత పెద్దగా మారినట్లుగా ఊహించుకోవలసి వుంటుంది.


10 సెం.మీ.ల పొడవుండే వాన పాము 20 రెట్లు పెద్దగా మారిందనుకుందాం (మనిషంత పొడవుగా). ఇలా జరిగినప్పుడు దాని పొడవు, వెడల్పు, మందం అన్నీ మారతాయి. అప్పుడు దాని బరువు మునపటి బరువుకన్నా 80,000 రెట్లు (10X20X20X20) పెరుగుతుంది. బరువుతో సమానంగా దానిలోని జీవకణాల సం ఖ్య, వాటి అవసరాలు కూడా పెరుగుతాయి.

10 సెం.మీ.ల వానపాముని 20 రెట్లు పెద్దగా చేసినప్పుడు దాని జీర్ణ నాళం 200 సెం.మీ. (10X20) పొడవవుతుంది. ఆ జీర్ణనాళపు మందం కూడా పెరిగి అది 200 రెట్లు పెద్దగా (10X20) అవుతుంది. అయితే పెరిగే ఈ మందం వల్ల ఎలాంటి ప్రత్యేక ప్రయోజనమూ చేకూరదు. మొత్తానికి వానపాములోని జీవకణాల సంఖ్య 80,000 రెట్లు పెరిగితే, దాని జీర్ణనాళం మాత్రం పొడవులో 20 రెట్లు, ఉపరితల వైశాల్యంలో 4000 రెట్లు పెద్దగా మారుతుంది. అయితే శరీరంలోని జీవకణాల సంఖ్యతో పోల్చినప్పుడు జీర్ణనాళపు ఈ ఉపరితల వైశాల్యం ఏ మాత్రం సరిపోదు. అంత కన్నా 10–15 రెట్లకు పైగా వైశాల్యం కావలసి వుంటుంది. సరిగ్గా ఈ కారణం వల్లనే మనిషి జీర్ణాశయం అతని కన్నా చాలా రెట్లు పెద్దగా వుంటుంది.

అంకెలు కలపండి రంగులు వేయండి




పూరించండి



కుడివైపున కొన్ని బ్రాకెట్స్, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లీష్ పదం మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లీష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి




F	S	K	A	T	I	N	G	H	O	C	K	E	Y	V
V	U	S	B	J	T	M	P	W	O	L	P	T	D	W
P	T	N	P	B	O	O	T	S	F	Y	S	A	L	T
S	N	O	W	M	A	N	Y	C	C	S	T	O	R	M
E	F	W	T	Z	L	S	E	I	R	R	U	L	F	S
S	F	M	L	E	E	L	Y	E	O	Y	Y	D	N	E
E	O	O	M	E	M	I	A	U	M	A	V	O	I	R
K	G	B	S	W	O	P	S	B	L	F	W	G	H	U
A	N	I	H	V	B	P	A	P	W	B	M	N	S	T
L	I	L	O	B	B	E	N	N	L	O	L	I	K	P
F	D	E	V	D	U	R	D	O	Q	U	N	H	I	L
X	I	N	E	D	B	Y	W	W	X	J	P	S	I	U
Z	L	K	L	N	I	E	L	D	T	L	D	I	N	C
F	S	V	V	L	R	K	T	F	I	R	D	F	G	S
T	S	C	R	A	P	E	R	J	W	W	H	I	T	E

BOOTS
DRIFT
FISHING
FLAKES
FLURRIES
FUN
HOCKEY
ICY
PLAY
PLOW
SALT
SAND
SCRAPER
SCULPTURE
SHOVEL
SKATING
SKIING
SLIDING
SLIPPERY
SNOWBALL
SNOWBLOWER
SNOWMAN
SNOWMOBILE
STORM
WHITE


పైన కొన్ని పదాలు ఉన్నాయి. పక్కన ఉన్న పజిల్‌లో ఆ పదాలు ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం!






ఈ రెండు బొమ్మల మధ్య 8 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

దారి కనుక్కోండి





ఈ బాతుపిల్ల అసలు నీడ ఏదో కనిపెట్టండి చూద్దాం!

వెండితెర



ఎంసీఏ
విమల్ డీలక్స్
(సిరిసిల్ల–08723–232311),
11.30, 2.30, 6.30, 9.30

2 కంట్రీస్
శ్రీలక్ష్మి (సిరిసిల్ల–08723–232016)
11.15,2.15, 6.15, 9.15

హలో!
నటరాజ్‌డీలక్స్
(సిరిసిల్ల–9440077241)
11.30, 2.30, 6.00,9.00

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

సిరిసిల్లటౌన్: ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా జేసీ యాస్మిన్ బాషా పాల్గొనగా ఉత్తమ ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, డీఈవో డాక్టర్ రాధాకిషన్, డీడబ్ల్యూవో సరస్వతి, ఎస్సీడీవో రాజేశ్వరి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు. టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక వస్త్ర వ్యాపార సంఘం భవనంలో కార్యక్రమం నిర్వహించారు. టీ మాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు కూరపాటి రమేశ్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పూలే దంపతులు చేసిన సేవలు ఎనలేనివన్నారు. జిల్లా కన్వీనర్ పంతం రవి ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సావిత్రిబాయి పూలే జయంతి బుధవారం నిర్వహించారు. వీర్నపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బండలింగంపల్లిలో ఉపాధ్యాయురాళ్లను సర్పంచ్ బాల్‌రాజు నర్సాగౌడ్ సన్మానించారు. మల్లారపు అరుణ్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్‌పర్సన్ పావని

ఇల్లంతకుంట: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మండలంలోని ముస్కాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తునికి తిరుపతి ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక ఉన్నత పాఠశాల, బస్టాండ్ ఆవరణలో టీ మాస్ ఫోరం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నారం నర్సయ్య, పసుల బాలరాజు, గణేశ్, అనీల్, రమణ, యాదగిరి పాల్గొన్నారు.

గంభీరావుపేట: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జెడ్పీటీసీ పద్మ పాల్గొన్నారు. లింగన్నపేట, మల్లారెడ్డిపేట, దోసలగూడెం పాఠశాలల్లోని మహిళా టీచర్లను సన్మానించారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో సుజాత, లక్ష్మిలను సన్మానించారు. భూలక్ష్మి పాల్గొన్నారు.

సిరిసిల్లరూరల్: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్క్‌లో టీమాస్ ఫోరం మండలాధ్యక్షుడు అన్నల్‌దాస్ గణేశ్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. రమణ, గంగాధర్, శ్రీరాముల రమేశ్ ఉన్నారు. పెద్దూర్ ప్రభుత్వ పాఠశాలలో పూలే సేవలను విద్యార్థులకు వివరించారు.

ముస్తాబాద్: సావిత్రిబాయి పూలే జయంతి ముస్తాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీటీఏ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నామాపూర్ మోడల్‌స్కూల్‌లో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో అశోక్‌రావు, ఎస్సై ప్రవీణ్, సీఐటీయూ నాయకుడు రమేశ్, చింతోజు బాలయ్య పాల్గొన్నారు.

దళితులకు మూడెకరాల పంపిణీకి భూ సేకరణ

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో దళితుల మూడెకరాల పథకానికి భూ సేకరణ చేపట్టినట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు. గ్రామ శివారులో 30 ఎకరాలు గుర్తించామన్నారు. త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేసి, భూపంపిణీ చేపడుతామన్నారు.

రగుడులో భూసర్వే

సిరిసిల్లరూరల్: సిరిసిల్ల అర్బన్ మండలం రగుడులో రెవెన్యూ అధికారులు భూసర్వే నిర్వహించారు. దళితులకు సంబంధించిన భూమిని సిరిసిల్లకు చెందిన లక్ష్మీరాజం అనే వ్యక్తి ఆక్రమించాడని కలెక్టరేట్ ముందు బాధితులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడీ శ్రీనివాస్ భూసర్వే చేశారు.

పోకిరీలకు కౌన్సెలింగ్

సిరిసిల్లక్రైం: అమ్మాయిలు, మహిళలను ఆకతాయి చేష్టలతో వేధించిన ఇద్దరు యువకులకు షీ టీం పోలీసులు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎస్సై మురళి చెప్పిన ప్రకారం.. పెద్దూరుకు చెందిన ఇద్దరు యువకులు పాతబస్టాండ్, ఏరియా ఆసుపత్రి వద్ద ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్నారు. వారిని ఠాణాకు తరలించి ఎస్సై మురళి, కానిస్టేబుల్ శ్రావణి కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎం సిద్ధిరాములు, ఉపాధ్యాయులు రవీందర్, రాజు, శ్రీవిద్య, సీఆర్పీ పద్మ, విద్యాకమిటీ చైర్మన్ చంద్రమౌళి పర్యవేక్షించారు.

‘స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి’

ఎల్లారెడ్డిపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్‌కే.గౌస్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కరికె శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అల్మాస్‌పూర్‌లో బుధవారం కాంగ్రెస్ గ్రామశాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దుల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ హుస్సేన్, కార్యదర్శిగా సోనవేని రాజయ్య, సహాయ కార్యదర్శిగా ఉచ్చిడి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా ఉచ్చిడి తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. సద్ది లక్ష్మారెడ్డి, పందిర్ల నారాయణగౌడ్, సిరిసిల్ల సురేశ్, వంగల కిష్టారెడ్డి, ఉచ్చిడి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలి’

గంభీరావుపేట: ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కానాపురం లక్ష్మణ్ అన్నారు. గంభీరావుపేటలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరాహార దీక్ష చేస్తున్న మంద కృష్ణ మాదిగను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాను, శంకర్, సంజీవ్, విజయ్, స్వామి, నర్సయ్య, రాజయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- పదోన్నతి పొందిన పోలీసులకు ఎస్పీ సూచన



పదోన్నతి పొందిన పోలీసులతో ఎస్పీ

సిరిసిల్లక్రైం: పదోన్నతి ద్వారా బాధ్యత పెరుగుతుందని, ఈసమయంలో క్రమశిక్షణతో సేవలందించాలని ఎస్పీ విశ్వజిత్ కంపాటి సూచించారు. పలువురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐగా పదోన్నతి లభించగా వారికి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ బ్యాడ్జీలు అందించి అభినందించారు. పదోన్నతి పొందిన వారిలో ఖాజామోయినోద్దీన్, సయ్యద్‌పాషా, జి.వీరయ్య, ఎండీ నజీమొద్దీన్, ఎస్.ప్రమీల ఉన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

గంభీరావుపేట: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తేవాలని జెడ్పీటీసీ మల్లుగారి పద్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో ఆకలి తీర్చడానికి జెడ్పీటీసీ సొంత ఖర్చులతో అల్పాహారం అందిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పాపగారి భూలక్ష్మి, ఎంపీడీవో సురేందర్‌రెడ్డి, ఎంఈవో బంతిలాల్, ఎంపీటీసీ కమలాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌అలీ, విద్యాకమిటీ చైర్మన్ జంగ కాశీరాములు, హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, ఉపసర్పంచ్ అక్కపల్లి బాలయ్య, మల్లుగారి నర్సాగౌడ్ పాల్గొన్నారు.



అల్పాహారం అందిస్తున్న జెడ్పీటీసీ పద్మ

5న దుకాణాల వేలం

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర సంక్రాంతి పండుగ రోజు ప్రారంభం కానుంది. ఉత్సవాలకు సంబంధించిన దుకాణాలకు 5న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొబ్బరికాయలు, పులిహోర, లడ్డూ దుకాణాలకు వేలం నిర్వహిస్తామన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ముస్తాబాద్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తరగతిలో గదిలో ఉండగా.. సదరు విద్యార్థిని తన బుక్‌లో ‘నేను ఉదయం మందు తాగాను.. మీ అందరిని మిస్ అవుతున్నా’ అని రాసి సహచర విద్యార్థులకు చూపింది. దీంతో ఆమెను ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వెస్‌లైన్‌లో కొబ్బరినూనె కలిపి తాగినట్లు విద్యార్థి వైద్యులకు తెలిపింది. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని వైద్యులు తెలిపారు.

‘సీపీఎస్ రద్దుకు ధర్మదీక్ష’

ఎల్లారెడ్డిపేట: సీపీఎస్ రద్దు కోసం టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఆయుత ధర్మదీక్షను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పాముల ఆంజనేయులు కోరారు. దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మార్సీ ఆవరణలో బుధవారం ఎంఈవో మంకు రాజయ్య ఆవిష్కరించారు. కాంబోజు సతీశ్, రాజేశ్, గంగాధర్, మహేందర్, రమేశ్, రాజు, భగవాన్, బాలకృష్ణ, మధుసూదన్, కిరణ్, భిక్షపతి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట: స్థానిక సాయిబాబా ఆలయంలో ఆర్యవైశ్య సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం మండల అధ్యక్షుడు గుండ చిన్నమల్లేశం ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి బచ్చు అశోక్, కోశాధికారి బొమ్మకంటి రాజేశం, కార్యవర్గ సభ్యులు అల్లాడి రాజేశం, కోట రాజేశం, ఆకుల గంగేశం పాల్గొన్నారు.

టీటీఎఫ్ ఆధ్వర్యంలో..

ముస్తాబాద్: టీటీఎఫ్ 2018 క్యాలెండర్‌ను మండల వనరుల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని టీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఈవో అశోక్‌రావు, డి.హన్మంతరెడ్డి, ఎల్లారెడ్డి, వి.చంద్రం, రాజలింగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

గంభీరావుపేట: గంభీరావుపేటలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి సంతోష, సిబ్బంది పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సెస్ డైరెక్టర్ దేవేందర్‌యాదవ్, ఎంపీటీసీ కమలాకర్‌రెడ్డి నర్సాగౌడ్, సర్పంచ్ భూలక్ష్మి ఉన్నారు.

'ఉమ్మెత్త'ను జంతువులు ఎందుకు తినవు?



పి. నీలకంఠయ్య
స్కూల్ అసిస్టెంట్

10th Class Special
బయాలజీ (తె.మీ.)


విసర్జన - వ్యర్థాల తొలగింపు వ్యవస్థ

సజీవుల మనుగడకు, వివిధ జీవక్రియల నిర్వహణకు శక్తి అవసరం. జీవులన్నీ జీవక్రియల నిర్వహణలో వివిధ రకాల పదార్థాలను ఉపయోగిస్తాయి. ఫలితంగా అనేక రకాల పదార్థాలు ఉత్పన్నమవుతాయి. వీటిలో హాని చేసే పదార్థాలను విసర్జించి, కొన్నింటిని వేరే రూపంలోకి మార్చుకుని నిల్వచేసుకుంటాయి. విసర్జన.. సజీవుల్లో జరిగే ఒక జీవక్రియ.

మన శరీరంలో ఉత్పన్నమయ్యే కార్బన్ డై ఆక్సైడ్, నత్రజని సంబంధిత వ్యర్థాలైన అమ్మోనియా, యూరియా, యూరికామ్లం, పైత్యరస వర్ణకాలు, అదనపు లవణాలు ఉంటాయి. కాబట్టి వీటిని శరీరం బయటికి విసర్జించాలి.

మానవ విసర్జక వ్యవస్థ

మానవుడిలో ఒక జత మూత్రపిండాలు, మూత్ర నాళాలు, మూత్రాశయం ఉంటాయి. మూత్రపిండం చిక్కుడుగింజ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. ఉదర కుహరంలో పృష్ఠశరీర కుడ్యానికి మూత్రపిండాలు అతుక్కుని వెన్నెముకకు ఇరువైపులా అమరి ఉంటాయి.



విసర్జన వ్యవస్థ


మూత్రపిండంలో పుటాకారంగా ఉన్న లోపలితలం మధ్యలోని పల్లాన్ని 'హైలస్' అంటారు. దీనిద్వారా వృక్కధమని మూత్రపిండంలోకి, వృక్కసిర మూత్రనాళం వెలుపలికి వస్తాయి. అంతర్నిర్మాణంలో ముదురు గోధుమ వర్ణంలో ఉన్న వెలుపలి భాగాన్ని 'వల్కలం'అని, లేత గోధుమ వర్ణంలో ఉన్న లోపలి భాగాన్ని 'దవ్వ' అని అంటారు. ప్రతీ మూత్రపిండంలో 1మిలియన్ కంటే ఎక్కువ నెఫ్రాన్‌లు ఉంటాయి.

ప్రతి నెఫ్రాన్‌లోనూ మాల్ఫీజియన్ దేహం, వృక్కనాళిక ఉంటాయి. మాల్ఫీజియన్ దేహంలో రక్తకేశనాళికలు గుచ్ఛంలా ఏర్పడి ఉంటాయి. దీన్ని 'గ్లామెరూలస్' అంటారు. గ్లామెరూలస్‌లో అధివాహి ధమనిక వ్యాసం.. అపవాహిధమనిక వ్యాసం కంటే ఎక్కువగా ఉంటాయి. దీంతో గుచ్ఛంలో పీడనం పెరిగి దానిలోని పదార్థాలు వడపోతకు గురవుతాయి. వృక్కనాళికలో సమీపస్థ సంవళితనాళం, హెన్లీశిక్యం, దూరస్థ సంవళిత నాళాలు ఉంటాయి. వృక్కనాళిక సంగ్రహణ నాళం ద్వారా చివరికి ద్రోణిలోకి తెరుచుకుంటుంది.

మూత్రం ఏర్పడే విధానం

మూత్రాశయంలో 700-800 మి.లీ. మూత్రం నిల్వ ఉంటుంది. మానవుడు రోజుకు సుమారు 1.6-1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు.

మూత్రం లేత పసుపురంగు ద్రవం. రక్తంలోని



మూత్రం తయారీ విధానం

హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం ఈ రంగుకు కారణం. అదే విధంగా మూత్రంలో 96శాతం నీరు, 2.5శాతం కర్బన పదార్థాలు (యూరియా, యూరిక్ ఆమ్లం, క్రియాటిన్ మొదలైనవి) ఉంటాయి.

మూత్రపిండాలు పనిచేయకపోవడం

వివిధ కారణాల వల్ల మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోతే శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోతాయి. ఈ దశను 'యురేమియ' అంటారు. ఫలితంగా కాళ్లు, చేతులు ఉబ్బుతాయి. దీనికి పరిష్కారంగా డయాలసిస్ యంత్రంతో రక్తాన్ని వడకడతారు. దీన్నే 'హిమోడయాలసిస్' అని అంటారు. ఈ సమస్య దీర్ఘకాలిక పరిష్కారం కోసం మూత్రపిండ మార్పిడి చేస్తారు. దాతల నుంచి అవయవాలను సేకరించి అమరుస్తారు. మానవుడిలో ఊపిరితిత్తులు, చర్మం, కాలేయం అనుబంధ విసర్జకాంగాలు.

మొక్కలు కూడా విసర్జనను జరుపుకొంటాయి. వీటిలో ప్రత్యేకమైన అవయవాలు లేవు. వ్యర్థాలు ఏర్పడే ప్రక్రియ మొక్కల్లో చాలా నెమ్మదిగా జరుగుతుంది. బాష్పోత్సేకం, బిందుస్రావం వ్యర్థాలను పండ్లల్లో రాఫైడ్‌లుగా నిల్వ చేసి మొక్కలు బయటికి పంపుతాయి. పిండిపదార్థాలు, ప్రొటీన్‌లు, కొవ్వులు అనేవి ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు. ఆల్కలాయిడ్‌లు, టానిన్‌లు, రెసిన్‌లు, జిగురులు, లేటెక్స్ మొదలైనవి ద్వితీయ జీవక్రియోత్పన్నాలు. ఇవి ఆర్థిక ప్రాధాన్యం కలవి.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

1. మూత్రపిండ అంతర్నిర్మాణం
2. నెఫ్రాన్ నిర్మాణం
3. మూత్రం ఏర్పడే విధానం
4. హిమోడయాలసిస్
5. వివిధ జీవుల్లో విసర్జక వ్యవస్థ
6. ఆల్కలాయిడ్‌లు
7. మూత్రపిండం అధ్యయనం-ప్రయోగశాల కృత్యం

ముఖ్య ప్రశ్నలు-జవాబులు

1. మొక్కల్లో తయారయ్యే పదార్థాలను ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు, ద్వితీయ జీవక్రియోత్పన్నాలుగా వర్గీకరిస్తారు. ఈ రెండింటికీ ఒక్కో ఉదాహరణ రాయండి.

జ. **ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు.**
ఉదా: పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు.
ద్వితీయ జీవక్రియోత్పన్నాలు:
ఉదా: ఆల్కలాయిడ్‌లు, రెసిన్‌లు, టానిన్‌లు, జిగుర్లు, లేటెక్స్.

2. జంతువుల నుంచి రక్షించుకోవడానికి మొక్కలు అనుసరించే విధానాలను మీ గ్రామంలో ఉన్న రెండు మొక్కలను ఉదాహరణగా తీసుకుని వివరించండి.

జ. **ఉమ్మెత్త:** ఈ మొక్కలో 'స్కోపాలమైన్' అనే ఆల్కలాయిడ్ విషపూరితంగా ఉండటం వల్ల వీటిని జంతువులు తినవు.
అత్తిపత్తి: తాకిన వెంటనే ఇవి ముడుచుకుంటాయి. తమనుతాము రక్షించుకుంటాయి.

3. మానవ శరీరంలో మూత్రపిండం ఒక ముఖ్యమైన విసర్జకావయవం. మానవుడిలో విసర్జన క్రియను అదనపు విధిగా నిర్వహించే అవయవాలు, అవి విసర్జించే పదార్థాల పేర్లు రాయండి.

జ. ***అనుబంధ విసర్జకావయవాలు***
i) ***ఊపిరితిత్తులు:*** CO_2, నీటి ఆవిరి
ii) ***చర్మం:*** లవణాలు అధికంగా ఉన్న నీటిని చెమట రూపంలో విసర్జిస్తుంది
iii) ***కాలేయం:*** యూరోక్రోమ్, పైత్యరస వ్యర్థాలు
iv) ***పెద్దపేగు:*** కాల్షియం, మెగ్నీషియం, ఐరన్‌ల లవణాలు

4. మూత్రపిండాన్ని విచ్ఛిన్నం చేసి, అందులోని భాగాలను మీరు పరిశీలించారు కదా, అయితే ఈ ప్రయోగం ఎలా నిర్వహించాలో వివరించండి.

జ. మూత్రపిండం బాహ్య, అంతర లక్షణాలను తెలుసుకోవడానికి మూత్రపిండాన్ని విచ్ఛిన్నం చేసి కింది విధంగా పరిశీలించాను.


కావాల్సిన పదార్థాలు: మాంసం కొట్టులో సేకరించిన మేక లేదా గొర్రె మూత్రపిండం లేదా మూత్రపిండ త్రీడీ నమూనా, పదునైన బ్లేడ్, ట్రే, నీరు.


మూత్రపిండం నిలువుకోత

పరిశీలనా విధానం:
i) మేక లేదా గొర్రె మూత్రపిండాన్ని సేకరించి, రక్తమంతా పోయేలా నీటితో శుభ్రంగా కడిగాను.
ii) పూర్తిగా ఆరిన తర్వాత దాన్ని ఒక ట్రేలో ఉంచి జాగ్రత్తగా పరిశీలించి, నోట్‌బుక్‌లో పరిశీలనలు నమోదు చేశాను.
iii) ఒక పదునైన బ్లేడు లేదా స్కాల్‌పెల్ సాయంతో మూత్రపిండాన్ని నిలువుగా కట్ చేసి, అంతర్గత నిర్మాణాన్ని పరిశీలించాను.

ఫలితాలు:
i) మూత్రపిండాలు చిక్కుడుగింజ ఆకారంలో ఉన్నాయి.
ii) ముదురు ఎరుపు రంగులో ఉన్నాయి.
iii) మూత్రపిండంపై గ్రంథుల్లాంటి నిర్మాణాలు అతుక్కుని ఉన్నాయి.
iv) హైలస్ ద్వారా వృక్కధమని లోనికి ప్రవేశిస్తుంది. వృక్కసిర, మూత్రనాళం వెలుపలికి వస్తాయి.


5. విసర్జక వ్యవస్థలో నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణమని దేన్ని పేర్కొంటారు. దాని బొమ్మ గీసి భాగాలు గుర్తించండి. అభివాహి ధమనిక వ్యాసం, అపవాహి ధమనిక వ్యాసం కంటే ఎక్కువ ఉండటానికి కారణం ఏమిటి?



నెఫ్రాన్ నిర్మాణం

జ. విసర్జక వ్యవస్థలో నెఫ్రాన్‌ను నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం అంటారు. అభివాహి ధమనిక వ్యాసం, అపవాహి ధమనిక వ్యాసం కంటే ఎక్కువ ఉండటానికి కారణం గ్లామెరూలస్‌లో పీడనం పెరిగి, దానిలోని పదార్థాలు వడపోతకు గురవుతాయి.

6. కింది చిత్రాల్లో ఉన్న జీవుల్లోని విసర్జక వ్యవస్థలను పట్టిక రూపంలో రాయండి



జ.

జీవిపేరు / వర్గం	విసర్జక వ్యవస్థ
ప్రోటోజోవా	కణం ఉపరితలం నుంచి వ్యాపనం ద్వారా
అనెలిడా	నెఫ్రీడియా
ఆర్థ్రోపొడ	హరిత గ్రంథులు, మాల్ఫీజియన్ నాళికలు
మానవుడు	మూత్రపిండాలు

'పరభాష ద్వారా బోధన అంటే సోపానాలు లేని సౌధం'



డాక్టర్ పి.వి.సుబ్బారావు
సబ్జెక్టు నిపుణులు

టీఎస్‌పీఎస్సీ టీఆర్‌టీ ఎస్‌జీటీ - తెలుగు ప్రత్యేకం

తెలుగు మెథడాలజీ

తెలుగు స్కూల్ అసిస్టెంట్స్ (ఎస్ఏ), లాంగ్వేజ్ పండిట్స్ (ఎల్‌పీ)కి మెథడాలజీ (బోధనాశాస్త్రం) కీలకమైంది. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలి. తెలుగు కంటెంట్ కంటే మెథడాలజీ కష్టమైన అంశం. ఈ సిలబస్‌లో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. వాటిని ఏ విధంగా చదవాలి అనే అంశాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలిద్దాం.

1. భాష-వివిధ భావనలు

ఇది సుదీర్ఘమైన అధ్యాయం. దీనిలో అతి ముఖ్యమైన అంశం ప్రథమ భాషగా తెలుగు బోధనోద్దేశాలు, లక్ష్యాలు, స్పష్టీకరణలతోపాటు కనీస అభ్యసన స్థాయికి సంబంధించిన అంశాలు చదవాలి. ద్వితీయ భాషగా తెలుగును ఎలా బోధించాలో శ్రద్ధగా చదవాలి. ఈ అధ్యాయం నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది.

ఉదా: స్వతస్సిద్ధ వాదాన్ని ప్రతిపాదించిన భాషావేత్త ఎవరు?
1) యాస్కాచార్యుడు
2) మాక్స్ ముల్లర్
3) నోమ్ చామ్‌స్కీ 4) బి.ఎఫ్. స్కిన్నర్

సమాధానం: (3) నోమ్ చామ్‌స్కీ

ఉదా: తెలుగును ద్వితీయ భాషగా బోధిస్తున్నప్పుడు మొదట సాధించాల్సిన విలువలు ఏవి?
1) అగణిత విలువలు
2) హృదయ గత విలువలు
3) పరిమిత విలువలు
4) పరోక్ష విలువలు

సమాధానం: (3) పరిమిత విలువలు

2. భాషా నైపుణ్యాలు

ఈ అధ్యాయంలో వ్యక్తిత్వ వికాస సోపానాలైన శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం అనే నాలుగు నైపుణ్యాలను శ్రద్ధగా చదవాలి. వీటి అంతర్గత సంబంధాలను ప్రత్యేకంగా పరిశీలించాలి. దీనిలో 'భాషణం'లో భాగంగా వాగుత్పత్తి, వాగింద్రియ నిర్మాణం, వర్ణోచ్చారణ స్థానాలు (స్థాన-కరణ, ప్రయత్నాలు), వాటి నివారణోపాయాలను చదవాలి.

3. ప్రణాళిక రచన-పాఠ్యగ్రంథాలు

ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా వర్గీకరించి చదవాలి. మొదటి భాగంలో 'విద్యా ప్రణాళిక, మౌలిక విద్యా ప్రణాళిక, పాఠ్య విషయ ప్రణాళిక, వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళికతో పాటు పాఠ్యభాగ పథకాన్ని చదవాలి. రెండో భాగంలో పాఠ్య పుస్తకాలైన ప్రధాన వాచకం, నిర్మాణ సూత్రాలు, పాఠ్య పుస్తకాల జాతీయీకరణ, ఉపవాచకం, కృషి పుస్తకం, (Workbook), ఆధ్యాత్మిక దర్శిని లాంటి అంశాలను శ్రద్ధతో అధ్యయనం చేయాలి. ఈ అధ్యాయం నుంచి పాఠ్యాంశాల అన్వయ ప్రశ్నలు అడిగే అవకాశం తక్కువగా ఉంటుంది.

4. విద్యా సాంకేతిక శాస్త్రం-సహ పాఠ్య కార్యక్రమాలు

ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా విభజించి చదవాలి. మొదటి భాగంలో బోధనోపకరణాల్లో రకాలైన శ్రవ్య, దృశ్యం, దృశ్య-శ్రవ్య బోధనోపకరణాలను పరిశీలనా దృష్టితో చదవాలి. కొన్నిసార్లు ఈ విభాగం నుంచి అత్యంత కఠినమైన ప్రశ్నలు అడుగుతుంటారు.

రెండో భాగమైన సహ పాఠ్య కార్యక్రమాల్లో భాగంగా భాషా క్రీడలు, వక్తృత్వం, ఉక్త రచన, వ్యాస రచన, పత్రిక నిర్వహణ, భాషా విహార యాత్రలు, సారస్వత సంఘాలు, గ్రంథాలు, పఠనాలయాలు, పరామర్శ గ్రంథాలు, మూల గ్రంథాలకు సంబంధించిన అంశాల గురించి స్థూలమైన అవగాహనతో చదవాలి.

5. సాహిత్య ప్రక్రియలు-బోధనా పద్ధతులు

ఇది మెథడాలజీ సిలబస్‌లో కీలకమైన అధ్యాయం. విస్తృతమైంది. ఎక్కువగా అన్వయ ప్రశ్నలకు అవకాశం ఉన్న అధ్యాయమిది. ఇందులో పద్య బోధన, గద్యబోధన, వ్యాకరణ బోధన, ఉపవాచక బోధన, కథా బోధన, నాటక బోధనలకు సంబంధించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

ఆధునిక ధోరణులైన క్రీడా, కిండర్ గార్డెన్, మాంటిస్సోరి, ప్రాజెక్టు, డాల్టన్, కృత్యాధార, నాటకీకరణ పద్ధతులను సూక్ష్మదృష్టితో చదవాలి. ఇందులో భాగంగా కార్యక్రమయుత బోధన, బృంద బోధన, సూక్ష్మ బోధనల గురించి అధ్యయనం చేయాలి. వీటిపై అన్వయాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఈ అధ్యాయం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి వీలుంది.

6. మూల్యాంకనం

ఒక పనిని పూర్తి చేసిన తర్వాత అది ఎంతమేరకు ఫలప్రదమైందో తెలుసుకునేందుకు దోహదపడే అంశం మూల్యాంకనం (Evaluation). ఇందులో నికష, పరీక్ష, పరిగణన, మదింపు, మూల్యాంకనం అనే భావనలు, వాటి తారతమ్యాల గురించి సూక్ష్మ దృష్టితో చదవాలి.

నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)లో భాగంగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను అధ్యయనం చేయాలి. వ్యాసరూప, లఘుత్తర, అతి లఘుత్తర, లక్ష్యాత్మక ప్రశ్నలపై దృష్టి సారించాలి.

పాటించాల్సిన సూచనలు

- ఆరు అధ్యాయాల సిలబస్‌లో 1, 5 అధ్యాయాలు కీలకమైనవి. వీటి నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- గత డీఎస్సీ, టెట్ ప్రశ్నాపత్రాల్లోని మెథడాలజీ ప్రశ్నలను చదవాలి.
- మెథడాలజీ నుంచి డీఎస్సీకి 32 ప్రశ్నలు వస్తాయి. వాటికి 16 మార్కులు. టెట్‌కు 6 ప్రశ్నలుంటాయి. వాటికి 6 మార్కులు. సిలబస్ దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి నోట్స్ తయారు చేసుకోవాలి.
- తెలుగు అకాడమీ డీఎడ్, బీఎడ్ మెథడాలజీ గ్రంథాలు చదవాలి.
- కంటెంట్‌తో అనుసంధానం చేసుకుంటూ మెథడాలజీని చదవాలి.
- పాఠ్య పుస్తక నిర్మాణ సూత్రాలను చదివేటప్పుడు పాఠ్య పుస్తక ఇతివృత్తాలతో అనుసంధానం చేసుకోవాలి.
- ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- మూల్యాంకనంలో వస్తున్న నిత్యనూతన మార్పులను అవగాహన చేసుకుని చదవాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వక్తృత్వ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో పెంపొందే నైపుణ్యం ఏది? (టెట్-2014)
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

2. భాషా ఉద్దేశాలు ఆరంభాలైతే, అంత్య ఫలితాలు ఏవి? (టెట్-2012)
1) ప్రయోజనాలు 2) పఠన పాటవాలు
3) అభ్యసనం 4) అనువర్తనాలు

3. వాచిక చర్యకు ముఖ్య ఆధారం? (టెట్-2012)
1) అభిప్రాయావళి 2) వైఖరీ నికష
3) పరిపృచ్ఛ 4) ప్రశ్నావళి

4. సాధారణంగా ఉక్త లేఖనాంశాన్ని మూడు సార్లు చెప్పాలి. అలా మొదటిసారి చెప్పినప్పుడు విద్యార్థి చేయవలసింది ఏది? (టెట్-2011)
1) తప్పులు సరిచూసుకోవాలి
2) ఏకాగ్రతతో వినాలి
3) వినాలి - రాయాలి 4) రాయాలి

5. పఠన లేఖనాంశాల్లో పఠనాన్ని 'స్వభాంశం' అంటారు. మరి లేఖనాన్ని ఏమంటారు? (టెట్-2011)
1) ప్రేరణాంశం 2) శబ్దాంశం
3) కారకాంశం 4) లక్షణాంశం

6. తరగతి గదిలో విద్యార్థుల శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపాధ్యాయుడు దృష్టిసారించాల్సిన ఒక అంశం ఏది? (టెట్-2012)
1) క్షుణ్నంగా పఠనం చేయాలి
2) కఠిన పదాలను పరిచయం చేయడం
3) పాఠాలను బాహ్యంగా చదివించడం
4) పాఠాలను మౌనంగా చదివించడం

7. 'ధ్వని, భావం మధ్య అనురూపమైన సంబంధం ఉంటుందని, ప్రకృతి అంతా లయాత్మకమని, ప్రతి పదార్థం ప్రకంపనలను కలిగి ఉంటుందని, ఆ ప్రకంపనలకు అనుగుణంగానే వక్త నోట శబ్దాలు వెలువడుతాయి' అని చెప్పే వాదం ఏది? (టెట్-2012)
1) బౌ-వౌ వాదం
2) డింగ్‌డాంగ్ వాదం
3) ధాతు వాదం 4) స్వతస్సిద్ధ వాదం

8. శిక్షణ బదలాయింపు సూత్రాన్ని అనుసరించి ప్రధాన వాచక అధ్యయనం దేనికి తోడ్పడుతుంది? (టెట్-2012)
1) భాషా లక్ష్యాల సాధన ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం
2) మాతృభాష ద్వారా సాధించిన భాషా నైపుణ్యాలను ఇతర భాషల అధ్యయనానికి వినియోగించడం
3) భాషా నైపుణ్యాల అభివృద్ధి ద్వారా భాషా లక్ష్యాలను సాధించడం
4) భాషాభిరుచిని పెంపొందించడం ద్వారా విరామ కాలాన్ని సద్వినియోగం చేయడం

9. 'భాషకు మూలం కొన్ని ధాతువులే' అని ప్రతిపాదించినవారు?
1) గార్గి 2) ఎలెన్ గార్డినర్
3) యాస్కాచార్యుడు 4) కాత్యాయనుడు

సమాధానాలు

1) 2 2) 1 3) 4 4) 2 5) 3
6) 1 7) 2 8) 2 9) 3

మాదిరి ప్రశ్నలు

1. భాషను 'మేథస్సు ప్రసరించే కాంతి'గా వర్ణించిన భాషావేత్త ఎవరు?
1) బెంజిమెన్ వార్ఫ్
2) ఎడ్వర్డ్ సఫైర్ 3) జాన్ స్టువర్ట్‌మిల్
4) ప్రొఫెసర్ విట్నీ

2. భాషను 'బహుముఖ వ్యవస్థ'గా వర్ణించిన వారెవరు?
1) ఎడ్వర్డ్ సఫైర్ 2) ఫిర్త్
3) విలియం జేమ్స్ 4) హాకెట్

3. 'ఉన్నత సంక్లిష్ట సూత్రజాలావలయం భాష' అని ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
1) లింగ్విస్టిక్ చేంజ్
2) మోడరన్ లింగ్విస్టిక్స్
3) లాంగ్వేజ్ ఈజ్ ది మోడరన్ వరల్డ్
4) ది సైన్స్ ఆఫ్ లాంగ్వేజ్

4. 'ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులు పలుకుతుంది' అని తెలిపే భాషావాదం ఏది?
1) యోహెహో వాదం
2) డింగ్‌డాంగ్ వాదం
3) స్వతస్సిద్ధ వాదం 4) అనుభవ వాదం

5. ఆధునిక భాషా శాస్త్రవేత్తలు సైతం అంగీకరిస్తున్న భాషోత్పత్తివాదం ఏది?
1) భగవద్దత్త వాదం
2) ధాతు వాదం 3) ప్రకంపనా వాదం
4) టట్‌టట్ వాదం

6. 'డింగ్‌డాంగ్ వాదానికి' మరో పేరు?
1) పూహూ వాదం 2) స్వతస్సిద్ధ వాదం
3) ప్రకంపనా వాదం
4) సంపాదనా వాదం

7. కింది వాటిలో సరికానిది ఏది?
1) డింగ్‌డాంగ్ వాదం - మాక్స్ ముల్లర్
2) ధాతు వాదం - యాస్కాచార్యుడు
3) స్వతస్సిద్ధ వాదం - లిబ్నిజ్
4) పూహూ వాదం - కొండెకల్

8. 'మాతృభాష తల్లి పాలలాంటిది. పరభాష దాది పాలలాంటిది' అని పేర్కొన్న వారెవరు?
1) మహాత్మాగాంధీ
2) కొమర్రాజు లక్ష్మణరావు
3) రవీంద్రనాథ్ ఠాగూర్
4) గొడవర్తి సూర్యనారాయణ

9. 'పరభాష ద్వారా బోధన అంటే సోపానాలు లేని సౌధంలాంటిది' అని తెలిపిన వారెవరు?
1) రైబర్న్
2) వావిలాల గోపాలకృష్ణయ్య
3) రవీంద్రనాథ్ ఠాగూర్
4) గొడవర్తి సూర్యనారాయణ

10. మాతృభాషకు ఉన్న పేర్లు?
1) ప్రాంతీయ భాష
2) దేశీయ భాష - స్థానిక భాష
3) ప్రథమ భాష - అధికార భాష
4) పైవన్నీ

11. 'శిశువు సౌందర్య దృష్టినీ, ఆనందానుభూతినీ వ్యక్తం చేయడానికి ఉపయోగపడేది మాతృభాష' అని నిర్వచించినవారు?
1) మహాత్మా గాంధీ
2) వావిలాల గోపాలకృష్ణయ్య
3) గొడవర్తి సూర్యనారాయణ
4) రైబర్న్

12. ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా స్వీకరించడానికి ఆయా రాష్ట్రాలకు అధికారం కల్పించిన రాజ్యాంగ అధికరణ ఏది?
1) 342 2) 345
3) 343 4) 346

13. అధికార భాషా సంఘం ఏ తేదీన ఏర్పడింది?
1) 1968 మార్చి 19
2) 1966 మార్చి 19
3) 1964 ఏప్రిల్ 10
4) 1966 ఏప్రిల్ 1

14. అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు ఎవరు?
1) అయ్యదేవర కాళేశ్వరరావు
2) వావిలాల గోపాల కృష్ణయ్య
3) వందేమాతరం రామచంద్రరావు
4) నండూరి రామకృష్ణమాచార్యులు

15. కింది వారిలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు కాని వారెవరు?
1) ఆచార్య పి. యశోదారెడ్డి
2) ఆచార్య సి. నారాయణరెడ్డి
3) ఆచార్య నాయని కృష్ణకుమారి
4) గజ్జెల మల్లారెడ్డి

16. తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎవరు?
1) డాక్టర్ ఎన్. గోపి
2) బి.ఎస్. రాములు
3) కాలువ మల్లయ్య
4) దేవులపల్లి ప్రభాకరరావు

17. కింది వాటిలో త్రిభాషా సూత్రంలో ద్వితీయ భాషగా హిందీని వ్యతిరేకించిన రాష్ట్రం ఏది?
1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
3) తమిళనాడు 4) కేరళ

18. తెలంగాణ రాష్ట్రంలో ద్వితీయ అధికార భాష ఏది?
1) హిందీ 2) ఉర్దూ
3) మరాఠీ 4) కన్నడ

19. ప్రథమ భాషగా తెలుగు బోధనలో ప్రధాన ఉద్దేశం?
1) అర్థ గ్రహణం 2) అభివ్యక్తి
3) గుణ వివేచన 4) పైవన్నీ

20. తెలుగును ద్వితీయ భాషగా ఏయే మాతృభాషల వారు అభ్యసిస్తున్నారు?
1) హిందీ, ఉర్దూ
2) తమిళం, కన్నడం
3) గుజరాతీ, ఒరియా, మరాఠీ
4) పైవన్నీ

21. ద్వితీయ భాషగా తెలుగు బోధన ఉద్దేశం?
1) తెలుగు భాష సంస్కృతిని తెలియజేయడం
2) దైనందిన కార్యక్రమాల్లో తెలుగును ఉపయోగించే నైపుణ్యాన్ని పెంపొందించడం
3) తమ భాషల్లోని భావాలను తెలుగులోకి, తెలుగులోని భావాలను తమ భాషల్లోకి పరివర్తన చేసే పరిజ్ఞానం పెంపొందించడం
4) పైవన్నీ

సమాధానాలు

1) 3 2) 2 3) 3 4) 4 5) 2
6) 3 7) 3 8) 2 9) 3 10) 4
11) 1 12) 2 13) 1 14) 2 15) 3
16) 4 17) 3 18) 2 19) 4 20) 4
21) 4

'గుట్టు'కా.. దందా..

- పట్టుబడినా పట్టువదలని వ్యాపారులు
- గస్తీ చేస్తూ రట్టుచేసే పనిలో పోలీసులు
- ప్రతీ నెల ఏదో మూల కేసులు నమోదు
- పాతవాళ్లే కొత్త మార్గాల్లో దందా
- సెల్‌ఫోన్‌లో చెప్పిన కోడ్‌తో కోరిన సరుకు..
- ఆమ్యామ్యాలు అందని పక్షంలో దాడులు..?


గుట్కా అమ్మకం చేస్తున్న వారిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు(ఫైల్)

సిరిసిల్లక్రైం: జిల్లాలో నిషేధిత గుట్కాల వ్యాపారం పెచ్చుమీరింది. కేంద్రం నిషేధాజ్ఞలు విధించినా..కొందరు వ్యాపారులు తమ లాభాపేక్షను వీడడం లేదు. పోలీసుల కళ్లుగప్పి కొందరు.. అధికారులకు తెలిసి మరికొందరు ఈ దందాను షరా'మామూలు'గా నడిపిస్తున్నారు. వ్యాపారులు పట్టుబడుతున్నా..బలమైన కేసులు విధించకపోవడంతో ఈ దందా మూడు గుట్కాలు...ఆరు ఖైనీలుగా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంగా కొనసాగుతున్న అక్రమ దందాపై కథనం.

జనావాసాల మధ్య గోదాములు

ఎవరికీ అనుమానం రాకుండా గోదాంలను జనవాసాల మధ్య ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వసనీయం సమాచారం. నిల్వ చేసిన గుట్కా వాసన రావడం, తీసుకెళ్లడానికి పలుసార్లు వాహనాలు రావడంతో ఆ ప్రాంతవాసుల చర్చలతో పోలీసులు నిఘావేసి పట్టుకున్న సందర్భాలు అనేకం. పటుకున్నవాటిని ఉన్నతాధికారుల ఆదేశాలతో దహనం చేస్తూ కేసులు రిమాండ్‌కు తరలిస్తున్నారు.

మళ్లీ మళ్లీ తప్పులపై చర్యలేవీ..?

అమ్మకాలు చేసే వారిపై కేసులు నమోదు చేయడం, రిమాండ్‌కు పంపడమనేది సర్వసాధారణంగా మారింది. రెండురోజులు జైలుకు వెళ్లి బెయిల్‌పై రావడం, మళ్లీ రూటుమార్చి వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. నిఘా చర్యలకు వెళ్లే అధికారులే వారి కనుసన్నల్లో గుట్కా వ్యాపారానికి గుట్టుగా భరోసా ఇస్తున్నారని, వ్యాపారికి, అధికారికి మధ్య విభేదాలు వచ్చిన సందర్భాల్లో మాత్రమే పట్టుకుంటున్నారనే విమర్శలున్నాయి.

అలవాటే ఆసరాగా దందా..

గుట్కాలకు అలవాటు పడిన వారి అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీటి అమ్మకాలు గతంలో పాన్‌షాపులు, కిరాణాల్లో సాగుతుండంగా పోలీసులు వాటిపై దాడులు చేసి హెచ్చరికలు చేశారు. కోడ్ పెట్టుకుని సెల్‌ఫోన్ సంభాషణలతో విక్రయిస్తున్నట్లు సమాచారం.

అధికారికంగా అరవై.. హెచ్చరికలు వేలల్లో..

గుట్కా అమ్మకాలు జరుపుతున్న క్రమంలో దాదాపు అరవైకి పైగా కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలున్నాయి. చిన్నాచితక అమ్మకాలు జరిపే వారిపై వేలల్లో ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. దొంగ వ్యాపారానికి రుచిమరిగినవాళ్లు మళ్లీ అదే రూటులో వెళ్తున్నట్లు తెలిసింది.

డిసెంబర్‌లో పోలీసులు పట్టుకున్న గుట్కా..

వేములవాడలోని ఓ సూపర్‌మార్కెట్ గోదాంలో రూ.50వేల గుట్కాను పట్టుకుని, వ్యాపారిని అరెస్ట్ చేశారు. సిరిసిల్లలో ఇద్దరు వ్యాపారుల నుంచి రూ.70వేల గుట్కాలను పట్టుకుని రిమాండ్ పంపించారు.

నిఘా పటిష్టం చేస్తాం



గుట్కాలు, అనుమతి లేని సిగరేట్స్ అమ్మరాదు. వీటిపై నిఘా పెట్టాం. పట్టుబడి రిమాండ్‌కు పంపినా వారిలో మార్పు రావడం లేదన్నది నిజం. దీనిపై ఉన్నతాధికారులకు విన్నవించి మరింత పటిష్టంగా చర్యలకు వెళ్తాం. హెచ్చరికలు చేసిన వాళ్లు వందల్లో ఉంటారు. మార్పు రాకుంటే కఠిన చర్యలు కఠినం తీసుకుంటాం.

– ఉపేందర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

- పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్
- పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో మంకు రాజయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.గంగాధర్ కోరారు. ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీలో ఉమ్మడి మండలాలు సంయుక్తంగా పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను బుధవారం ఎంఈవో మంకు రాజయ్య ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన గంగాధర్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమల్లోకి తేవాలన్నారు. పండిత, పీఈటీల అప్‌గ్రేడేషన్ అమలు చేయాలన్నారు. మండల అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి, కృష్ణహరి, వీర్నపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేశం, మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకర్, పర్శరాం, అంజల్‌రెడ్డి, భగవాన్, శివప్రసాద్, రాజ, బాలకిషన్, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి


గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్

వేములవాడఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ కోరారు. వేములవాడ మండలం మర్రిపల్లి, నూకలమర్రి, రుద్రవరం గ్రామల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమన్ని బుధవారం ప్రారంభించారు. డీఈవో రాధాకిషన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. వేములవాడరూరల్ సీఐ రఘుచందర్ మాట్లాడుతూ పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. వేములవాడరూరల్ ఎస్సై రాజశేఖర్, వేములవాడరూరల్ తహసీల్దార్ మునీందర్, సర్పంచులు పిట్టల వెంకటేశ్, జాగిరి సత్యనారాయణ. పిల్లి రేణుక, ఎంపీటీసీ పెండ్యాల తిరుపతి, తునికి లక్ష్మి, ఉపసర్పంచ్ గాలిపెల్లి స్వామి, కట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

'నేరెళ్ల బాధ్యులను శిక్షించాలి'

సిరిసిల్లటౌన్: నేరెళ్ల ఘటన బాధ్యులను శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు కోరారు. ఈమేరకు వామపక్షాలు, టీజేఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జనవరి 6న సిద్దిపేట నుంచి నేరెళ్ల వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు కరపత్రాలను బుధవారం కార్మిక భవనంలో ఆవిష్కరించారు. ఇసుక మాఫియాకు వంతపాడుతూ..పోలీసులు నేరెళ్ల దళితులపై దాడులు చేశారని ఆయన ఆరోపించారు. ఈసంఘటనలో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ చేపడుతున్న పాదయాత్ర జనవరి 6న ఉదయం 10గంటలకు ప్రారంభమై సాయంత్రం నేరెళ్లలో బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం, టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం వస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బొజ్జ కనకయ్య, పంతం రవి, చొటపెల్లి వేణుగోపాల్, ప్రసాద్, పోలు కొమురయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదం

- అధికారులతో ఫ్లోర్‌లీడర్ల వాగ్వాదం

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కార్యక్రమాల్లో అధికారులు, చైర్‌పర్సన్ ప్రొటోకాల్ పాటించడం లేదని కాంగ్రెస్, బీజేపీ ఫ్లోర్‌లీడర్‌లు బుర్ర నారాయణగౌడ్, ఎర్రం వెంకట్రాజం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిరిసిల్ల గాంధీచౌక్‌లో నిర్వహించిన స్వచ్ఛసర్వేక్షణ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమం ఉదయం 9 గంటలకు వచ్చి, గంటల తరబడిగా వేచి చూసినా తమకు ప్రాధాన్యం కల్పించలేదన్నారు. వార్డుల్లో స్వచ్ఛత కోసం తాము అహర్నిశలు కృషి చేస్తేనే మున్సిపల్‌కు అవార్డులు వస్తున్నాయన్న విషయాన్ని మరవద్దన్నారు. గాంధీచౌక్ స్థలం 7, 8 వార్డుల్లో ఉందని అయినా తమకు ముందస్తు సమాచారం ఎందుకు ఇవ్వలేదని కౌన్సిలర్లు పత్తిపాక పద్మ, కొండ అనూష ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

సెస్ కాంట్రాక్టు ఉద్యోగుల వంటావార్పు

సిరిసిల్లటౌన్: సెస్‌లో 13 ఏళ్లుగా విధులు నిర్వహించిన తమను తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం కాంట్రాక్ట్ కార్మికులు వంటావార్పు చేపట్టారు. కలెక్టరేట్ ఎదురుగా చేపట్టిన దీక్షలు బుధవారం 26వ రోజుకు చేరాయి. గడ్డం రవీందర్‌రెడ్డి, మో హన్‌రెడ్డి, సురేష్, ప్రదీప్, అనిల్, సంధ్య, జ్యోతి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

రగుడు దళితుల నిరసన

సిరిసిల్ల అర్బన్ మండలం రగుడు దళితుల భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. బుధవారం దీక్షలో లీల, దేవవ్వ, పోశవ్వ, నర్సయ్య, లక్ష్మి, లచ్చవ్వ, బాలయ్య పాల్గొన్నారు.

గొలుసుకట్టు కాలువలను పునరుద్ధరించాలి

కొత్తకాలువలతో నష్టపోతున్న నిరుపేద రైతులు

- పాత కాలువలను బాగుచేస్తే మేలు
- కాళేశ్వరం అధికారులకు నాలుగు గ్రామాల రైతుల వినతి


ఈఈ బుచ్చిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

కోనరావుపేట(వేములవాడ): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మల్కపేటలో నిర్మిస్తున్న రిజర్వాయర్ నుంచి మండలంలోని చెరువులను నింపేందుకు పాత గొలుసుకట్ట కాలువలను పునరుద్ధరించాలని కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల గ్రామాల రైతులు బుధవారం ఎంపీ వినోద్‌కుమార్, కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఈ బుచ్చిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మల్కపేట రిజర్వాయర్ నుంచి వేములవాడ మండలం నాంపెల్లి వరకు కాలువలు తవ్వేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. అయితే మల్కపేట పెద్దచెరువు నుంచి కనగర్తి బూరుగు చెరువు వరకు, బూర్గు చెరువు నుంచి నాగారం లక్ష్మణ్‌రావుకాలువ వరకు, అక్కడి నుంచి పల్లిమక్త, సుద్దాల గ్రామాల చెరువుల వరకు కాలువలు ఇప్పటికే ఉన్నాయని, వీటినే పునరుద్ధరించాలని కోరారు. పాత కాలువలను పట్టించుకోకుండా కొత్త కాలువలను నిర్మించడం ద్వారా చిన్న, సన్నకారు రైతులు నష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. పైగా ప్రభుత్వానికి కూడా ఖర్చు అధికమవుతుందని అన్నారు. ఈ గొలుసుకట్టు కాలువలను బాగు చేయడం ద్వారా అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి మేలు జరుగుతుందని వివరించారు. రైతుల కోరికను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని వారు హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, రైతులు కాసర్ల నర్సయ్య, వంగపెల్లి మల్లయ్య, బాలయ్య, జిల్లెల్ల మల్లారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు


మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సిరిసిల్లటౌన్: ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్లలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అట్టడుగు వర్గాలను అక్షరాస్యులను చేయడానికి పూలే దంపతుల కృషి ఎనలేనిదన్నారు. కొత్త జిల్లాల్లోని విద్యాశాఖలో ఖాళీగా ఉంటున్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ మూడున్నరేళ్లుగా ఖాళీగా ఉంటున్న పోస్టులనే భర్తీ చేయడం లేదని విమర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, బీసీ టీచర్స్ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా మహిళా కన్వీనర్‌గా పద్మజ


పద్మజ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న చెక్కబండి పద్మజను తెలంగాణ ప్రొగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా మహిళా విభాగం కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పద్మజ సంఘం బలోపేతానికి చేస్తున్న కృషిని గుర్తించి ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పద్మజను ప్రధానోపాధ్యాయులు ఆడెపు సుదర్శన్, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

జలం.. గరళం



ఈచిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు కారంపురి లక్ష్మి. సిరిసిల్ల బీవైనగర్ నివాసి. కుళాయి నుంచి వచ్చే నీటిని తాగితే వాంతులు, విరోచనాలకు గురవుతోంది. సబ్బుపెట్టి గట్టిగారాసి స్నానం చేసినా దుర్వాసన దేహాన్ని వీడడంలేదు. గత్యంతరంలేక రోజూ రూ.150 వెచ్చించి ట్యాంకర్ ద్వారా నీళ్లు కొనుగోలు చేస్తూ కుటుంబ అవసరాలు తీర్చుతోంది. దాదాపురెండు నెలలుగా ఇదే పరిస్థితి.

- కలుషిత తాగునీరు సరఫరా
- రెండునెలలుగా ఇదేపరిస్థితి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- రక్షితనీటి పథకంపై బల్దియా అధికారుల చిన్నచూపు
- వ్యాధులబారిన కార్మిక కుటుంబాలు



నల్లా నుంచి వస్తున్న మురుగునీరు ఇలా..

సిరిసిల్లటౌన్: కార్మికవాడలంటే అందరికీ అలుసే.. నిరుపేదలు, నేతకార్మిక కుటుంబాలు కాబట్టి సమస్యలు పరిష్కరించకున్నా ఎవరూ ప్రశ్నించేవారు ఉండరు. ఎప్పుడో ఓట్లప్పుడు తప్ప రాజకీయ నాయకులకూ ఆ పేదల అవసరాలూ గుర్తుకురావు.. అందుకే.. దాదాపు రెండునెలలుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఆ నీటిని తాగి స్థానికులు వాంతులు, విరోచనాలకు గురవుతున్నా సమస్య మూలాలు తెలుసుకునేందుకు యత్నించరు. జిల్లాకేంద్రంలోని బీవైనగర్, తారకరామనగర్, ఇందిరానగర్, గణేశ్‌నగర్, సుందరయ్యనగర్, శివనగర్ తదితర ప్రాంతాల్లో పైపులైన్ల ద్వారా మురుగునీరు సరఫరా అవుతున్నా ఎవరికీ పట్టింపు ఉండదు.

సిబ్బంది ఫుల్..సేవలు నిల్..

రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి 27మంది మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. సాయినగర్, విద్యానగర్, సుభాష్‌నగర్, పద్మనగర్ వాటర్ ట్యాంకు, సాయినగర్, విద్యానగర్ పంప్‌హౌస్‌లు, రగుడు ఫిల్టర్‌బెడ్ వద్ద 17మంది, లీకేజీ వర్కర్లు 10 మంది పనిచేస్తున్నారు. అయినా తాగునీటి పైపులైన్ల లీకేజీలు, పగుళ్లు సరిచేయడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

నీరుగారుతున్న నిర్లక్ష్యం..

జిల్లాకేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన తాగునీటిపైపులైన్ల మిషన్ భగీరథ పథకం కోసం తవ్విన గుంతలతో పగిలిపోయాయి. కొన్నిచోట్ల లీకయ్యాయి. ఈసమస్య ప్రధానంగా బీవైనగర్, తారకరామానగర్, ఇందిరానగర్, గణేశ్‌నగర్, సుందరయ్యనగర్, శివనగర్, కొత్తబస్టాండ్, గోపాల్‌నగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో అధికంగా ఉంది. లీకేజీల్లోంచి లోనికి చేరిన నీరు కలుషితం కావడంతో ఆ నీటినే స్థానికులు తాగాల్సి వస్తోంది. ఒక్కోసారి కూరగాయల ముక్కలు, దుర్గంధంతో కూడిన వ్యర్థాలు వస్తున్నాయి.



ఇది తాగునీరే..

రక్షణ చర్యలు తీసుకుంటాం

మాకు అందిన ఫిర్యాదులపై స్పందించి మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో చర్చించి కలుషిత నీరు సరఫరాను నియంత్రిస్తాం. రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. తాగునీటి సరఫరాలేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

- రమణాచారి, మున్సిపల్ కమిషనర్

నిలువెల్లా లీకేజీలు..

పట్టణంలో ఎక్కడ చూసినా పగిలిన మంచినీటి పైప్‌లైన్లే దర్శనమిస్తున్నాయి. అధికారుల్లో కార్యదీక్షత లోపంతోనే పాత, కొత్త పైప్‌లైన్లు పగిలిపోతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు ప్రణాళికలేమి గందరగోళంగా తయారైంది. ఎస్పీ కార్యాలయం సమీప ప్రభుత్వ పాఠశాల – కలెక్టరేట్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, గాంధీరోడ్డు, గోపాల్‌నగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై పైపులైన్లు లీకై మురుగునీరు పైపుల్లోకి చేరుతోంది. ఇట్లాంటి ప్రాంతాలను గుర్తించి సరిచేయడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

- కుల, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు



మిఠాయిలు తినిపిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: తొలిమహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బీసీ సంక్షేమ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు హాజరయ్యారు. బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, యువజన సంఘం అధ్యక్షుడు సామల రాజుగౌడ్, నాయకులు వీరవేని మల్లేశంయాదవ్, కంచర్ల రవిగౌడ్, మచ్చ యశ్వంత్, మునిగెల రాజు, కాముని నలినికాంత్, జెగ్గని మల్లేశం, బండి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు జరపగా డీఐఈవో రాంచందర్, ఎస్సీడీవో రాజేశ్వరి, నాయకులు బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రంలో 'తెలంగాణ తెగారం'

- జిల్లా కథారచయితకు మరోగౌరవం



పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన ప్రసిద్ధ కథారచయిత పెద్దింటి అశోక్‌కుమార్ కథకు మరో గౌరవం దక్కింది. తను రాసిన 'తెగారం కథ'ను తానే నాటకంగా మలిచారు. దీంతో అది తెలుగు రాష్ట్రాల్లో ప్రజాదరణ పొందుతోంది. శివసత్తుల ఆర్ధ్రత, ఆందోళన, ఆరాటాల నేపథ్యంలో రూపుదిద్దుకున్నదే తెగారం కథ ఇతివృత్తం. తెలంగాణ జీవన సంస్కృతిని, వైవిధ్యాన్ని మనదైన మాండలిక భాషలో దృశ్యమానం చేసిందీ నాటకం. ఇటీవలే సంగీత, సాహిత్య నృత్య నాటక పోటీల్లో ఉత్తమ నాటకంగా ఎంపికైంది. బుధవారం రాత్రి 7 గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శింపబడుతోంది. కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా ప్రముఖ రంగస్థల నటుడు డాక్టర్ మల్లేశ్ బల్లాష్ట్ దర్శక సారథ్యంలో జాబిల్లి కల్చరల్ సొసైటీ, రాష్ట్రభాష, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన జరుగుతోందని కథారచయిత పెద్దింటి అశోక్ కుమార్ తెలిపారు.

గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

- కరీంనగర్ జిల్లా జైలర్ రామకృష్ణ

బోయినపల్లి(చొప్పదండి): చిన్నవివాదాలతోపాటు భూసమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని కరీంనగర్ జిల్లా జైలర్ గొట్టె రామకృష్ణ కోరారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిటిజన్ ఫోరం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతగాదాలకు పోలీసప్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం వృథా చేసుకోవద్దని కోరారు. కోర్టుల్లో గ్రామాల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని సూచించారు. న్యాయవాది అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాఖాలోనే అవినీతి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు



టీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో చూపిస్తున్న ఉమేశ్

సిరిసిల్లటౌన్: మైనింగ్, మున్సిపల్ శాఖలకు ప్రాతిని ధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఇలాఖాలోనే అ వినీతి చోటు చేసుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు విమర్శించా రు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల కేంద్రంగా ఇసుక అక్రమంగా తరలిపోతోందని, దీనికి అధికార పార్టీ నాయకులే సూత్రధారులని ఆరోపించారు. టీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో చేర్చిన అంశాలు కాకుండా అవినీతి, అక్రమాలకు తావిచ్చే అప్రధా న పథకాలకు రూ.వేల కోట్లు వెచ్చిస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. నేరెళ్ల ఘటనలో దళితులను చిత్రహింసలకు గురిచేసిన ఎస్పీ.. ఇసుక మాఫియాలోని ఏ ఒక్కరిపైనా ఎందుకు కేసులు న మోదు చేయడంలేదని ప్రశ్నించారు. రెవెన్యూ, మైనిం గ్, పోలీస్ అధికారులు రూ.లక్షలు వక్రమార్గంలో ఆర్జిస్తున్నారని, ఇందుకు సిరిసిల్ల నుంచి ఇతర జిల్లాలకు వేబిల్లులు లేకుండా లారీలు, ట్రాక్టర్లు ఇసుక తరలించడమే నిదర్శనమన్నారు. పేదలకు 125 గజాల స్థలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని ఓట్లు దం డుకున్న అధికార పార్టీ మూడున్నరేళ్లలో ఎంతమందికి ఇళ్లు కట్టిచారని ప్రశ్నించారు. మైనింగ్, మున్సి పల్ శాఖ నిర్వహణకు మంత్రి కేటీఆర్ సరికాదని, ఆయనకు ప్రావీణ్యం ఉన్న ఐటీ శాఖనే కొనసాగాలని సూచించారు. జిల్లా ఉన్నతాధికారులు టీఆర్‌ఎస్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని, అందుకే అవినీతి పెచ్చుమీరుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్ర నారాయణ, వైద్య శివప్రసాద్, ఆడెపు చంద్రకళ, కూతురు వెంకట్‌రెడ్డి, ఎడమల భూపాల్‌రెడ్డి, బైతి నవీన్, ఒనగంటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి ఉపాధ్యాయుడికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు అంజయ్య

చందుర్తి(వేములవాడ): మర్రిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండితుడు మేడికాల అంజయ్య బుధవారం ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. సావిత్రీబాయిపూలే ప్రజా సంక్షేమ సంఘం ఈ అవార్డు ప్రకటించింది. వరంగల్ అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన పూలే జయంతి సందర్భంగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు యేవూరి వెంకటేశ్వర్‌రావు ద్వారా పురస్కారం అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయడంతోపాటు ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



రోడ్డుపైనే స్తంభం



చందుర్తి: మండలంలోని బండపల్లి హనుమాన్ ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభం రోడ్డుపైనే ఉంది. ఇటీవలే పక్కనే మరో స్తంభం ఏర్పాటు చేసిన, రోడ్డుపైన ఉన్న ఇనుప స్తంభాన్ని మాత్రం తొలగించలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 9705346626

చందుర్తి: గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ కంచెలు లేక ప్రమాదకరంగా మారాయి. గ్రామ చావడిలు, పాఠశాలల సమీపంలో, రోడ్ల వెంట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వాటికి కంచెలు ఏర్పాటు చేయాలని కోరినా.. సెస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



డేంజర్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ కంచెలు కరువు
- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

అన్ని గ్రామాల్లో ఇదే దుస్థితి

మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగానే ఉన్నాయి. మండలంలో దాదాపు 198 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో 52 గ్రామాల్లో ఉన్నాయి. ఇవి ఇళ్ల మధ్య, పాఠశాలల సమీపంలో రక్షణ కంచె లేకుండా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో చిన్న పిలలకు, పశువులకు తగిలే అవకాశం ఉంది. కిష్టంపేట, సనుగుల, ఆశిరెడ్డిపల్లె, చందుర్తి, నర్సింగాపూర్, మూడపల్లి గ్రామాల్లో పాఠశాలల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

రెండు గ్రామాలకే 'కంచెలు'

మండలంలోని లింగంపేట, కట్టలింగంపేట గ్రామాల్లో జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేశారు. మిగతా గ్రామాల్లో ఏర్పాటుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలల సమీపంలోని వాటికైనా మొదట కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల సమీపంలో..



కిష్టంపేట ప్రాథమిక పాఠశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేదు. విద్యార్థులు ఎక్కువగా అదే ప్రాంతంలో తిరుగుతారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలి.

– అంబరి కమలాకర్, కిష్టంపేట

రక్షణ కంచె ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్ ఇళ్ల మధ్యలో ఉండడంతో అప్పుడప్పుడు మంటలు చెలరేగుతున్నాయి. ఒక్కోసారి మంటలు చేలరేగి చుట్టూ ఉన్న గడ్డిపై నిప్పులు పడుతున్నాయి. గమనించి చల్లార్చకపోతే మంటలతో ఇళ్లకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలి.

– గడ్డం అంజిరెడ్డి, బండపల్లి

త్వరలోనే కంచెలు ఏర్పాటు



మండలంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాం. పాఠశాలలు, జనం ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించాం. వాటికి రెండు, మూడు నెలల్లో కంచెలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.

– మనోహర్, సెస్ ఏఈ

న్యూస్ బాక్స్

ఉద్యోగ విరమణ సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరం పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసిన గాలిపెల్లి రాములు ఉద్యోగ విరమణ చేయగా, బుధవారం సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గాలిపెల్లి రాములు సేవలను కొనియాడారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాములు పోస్టాఫీసు ద్వారా అందించిన సేవలు మరువలేనివన్నారు. వేములవాడ సబ్ పోస్ట్‌మాస్టర్ రవీందర్, సర్పంచ్ పిల్లి రేణుక, ఎంపీటీసీ తునికి మల్లయ్య, ఉపసర్పంచ్ గాలిపెల్లి స్వామి, కనుకయ్య, తునికి మల్లయ్య, ఉరడి రాంరెడ్డి, కట్ట శ్రీనివాస్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

చందుర్తి: రుద్రంగి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా టి.కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి పదవి విరమణ పొందగా కుమార్ బదిలీపై వచ్చారు.

హైదరాబాద్‌కు బస్సు నడపాలని వినతి

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్ సౌకర్యాన్ని కల్పించాలని సర్పంచ్ నల్ల గోవర్ధన్, ఉపసర్పంచ్ పూడూరి ప్రవీణ్ డిపో మేనేజర్ వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు. నిమ్మపల్లి నుంచి హైదరాబాద్ రోజుకు ఒక ట్రిప్పు వేస్తే కొండాపూర్, వెంకట్రావుపేట, కోనరావుపేట, నిజామాబాద్, మల్కపేట, ధర్మారం తదితర గ్రామాలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, శంకర్ ఉన్నారు.

రెండు గ్రామాల్లో గ్రామసభలు

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి, నర్సింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. బూర్గుపల్లిలోని పలు వీధుల్లో మురుగుకాలువలు, సీసీ రోడ్ల సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు పలువురు గ్రామసభలో ప్రస్తావించారు. నర్సింగాపూర్ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరాలని తీర్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పెంచాల సరోజన, బొజ్జ లక్ష్మీరాజం, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, సత్తయ్య పాల్గొన్నారు.

గుడి చెరువు భూసేకరణ సర్వే

వేములవాడ: రాజన్న గుడి చెరువు అభివృద్ధి, సుందరీకరణకు భూసేకరణ పనులను సిరిసిల్ల ఆర్డీవో పాండురంగ బుధవారం పరిశీలించారు. భగవంతరావునగర్‌లోని పలు భూములను ఆయన భూయజమానులతో కలసి పరిశీలించారు. నష్టపరిహారం ప్రకటించే వరకు తమ భూముల్లో పనులు కొనసాగనివ్వమని యజమానులు పేర్కొంటున్నారు. ఆర్డీవో మాట్లాడుతూ భూముల యజమానులను గుర్తించి నెల రోజులలోపు పరిహారం అందజేస్తామన్నారు. ఇక్కడి భూముల యజమానులను ఇంకా పూర్తిగా గుర్తించలేదన్నారు. భూములు ఉన్నవారు స్థానిక తహసీల్దారును సంప్రదించి వివరాలు అందజేయాలని సూచించారు. భూసేకరణకు సహకరించాలని కోరారు. గురువారం సైతం భూముల సర్వేకు వస్తామన్నారు. తహసీల్దారు నక్క శ్రీనివాస్ ఉన్నారు.



భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో పాండురంగ, తహసీల్దార్ శ్రీనివాస్

లోకల్ వాయిస్

రోడ్డు బాగుచేయండి



బోయినపల్లి: బోయినపల్లి మండలం రామన్నపేట గ్రామం నుంచి స్తంభంపల్లి వరకు అంతర్గత రహదారి పూర్తిగా చెడిపోయింది. రోడ్డు బాగా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి రోడ్డు బాగుచేసేందుకు చర్యలు చేపట్టాలి.

– చింతలపెల్లి వెంకటరెడ్డి, రామన్నపేట



రాజరాజేశ్వరీ:
ఎంసీఏ (వేములవాడ)
11.00, 2.00, 6.00, 9.00
శివరామకృష్ణ: హలో
(వేములవాడ) 11.00, 2.00,
6.00, 9.00

చెత్తవేసే ప్రాంతాల్లో ముగ్గులు



ముగ్గు వేసిన సిబ్బంది

వేములవాడ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో బుధవారం వివిధ ప్రాంతాల్లో నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది చెత్తవేసే ప్రాంతాల్లో ముగ్గులు వేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ కోరారు.

వైద్యసేవలు

వేములవాడ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం వైద్యులు మహేశ్‌రావు, స్రవంతి రోగులకు సేవలందించనున్నట్లు సూపర్‌వైజర్ బాలయ్య తెలిపారు.

గ్యాస్ సరఫరా

ఇండియన్ గ్యాస్– సిలిండర్ కావాల్సిన వారు 9848824365 నంబర్‌కు ఫోన్ చేసి బుకింగ్ చేసుకోవచ్చని ఇన్‌చార్జి గోపాల్ తెలియజేశారు. బుకింగ్ అయిన వెంటనే సిలిండర్ అందజేస్తామన్నారు.

భారత్ గ్యాస్– ఈనెల 3వరకు బుకింగ్ చేసుకున్న వారికి సిలిండర్లు అందజేస్తున్నామని ఇన్‌చార్జి ప్రతాప నవీన్ తెలిపారు. బుకింగ్ ఉదయం 9 నుంచి 12 ఉంటుందన్నారు. బుకింగ్ నంబర్ 08723–238484.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

వేములవాడ: మూఢనమ్మకాలు తొలగి దేశం అభివృద్ధి బాటలో పయనించాలంటే అక్షరాస్యత అవసరమని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా చైర్మన్ అక్కనపల్లి కరుణాకర్ అన్నారు. సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం నినాదాలు చేశారు. వెనుకబడిన వర్గాల, మహిళల కోసం ఆమె 52 పాఠశాలలు ప్రారంభించారన్నారు. దేవరాజు, భాస్కర్, కరుణాకర్, తిరుపతి, దివాకర్, శాంతకుమార్, శ్రీనివాస్, అనిల్, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని తహసీల్దారు నక్క శ్రీనివాస్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆయన బుధవారం మహిళా టీచర్లను సన్మానించారు.

చందుర్తి: దేశంలోనే సావిత్రిబాయి మొదటి ఉపాధ్యాయురాలని రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దప్పుల అశోక్ అన్నారు. మండలంలోని మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూలే జయంతి బుధవారం చార్వాక యూత్ జిల్లా కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అశోక్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. లక్కె రాజు, లక్కె బాబు, సుదర్శన్, చార్వాక సాంస్కృతిక రాష్ట్ర కన్వీనర్ గజ్జెల అశోక్, చెప్యాల గణేశ్, కొట్టే లింగయ్య, దేవరాజు, బడే అమర్ పాల్గొన్నారు. రుద్రంగి మండలంలోని మానాల, రుద్రంగి పాఠశాల్లోని ఉపాధ్యాయురాళ్లను పూలే జయంతి సందర్భంగా బుధవారం సన్మానించారు. హెచ్‌ఎం గంగాధర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మామిడి పర్శరాములు, దత్తాద్రి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు



బోయినపల్లిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఉపాధ్యాయురాళ్లకు సన్మానం

వేములవాడఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో భాగంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. వేములవాడ మండలం హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమరాణిని జాయింట్ కలెక్టర్ యాస్మీన్‌బాషా సన్మానించారు.

బోయినపల్లి: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం మండల స్వేరోస్ కమిటీ, బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థినులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి దేవరకొండ వినోద, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కట్ట రాజయ్య, మండల అధ్యక్షుడు మాంకాళి తిరుపతి, స్వేరోస్ మండల అధ్యక్షుడు బొడ్డు తిరుపతి, అక్కెనపెల్లి బాబు, ఉపేందర్, దాసరి సురేశ్, అలువాల అజయ్ ఉన్నారు.

రూసో కళాశాలలో..

మండలంలోని వెంకట్రావుపల్లి రూసో డీఎడ్ కళాశాలలో సావిత్రిబాయి జయంతి నిర్వహించారు. చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, ప్రిన్సిపాల్ దేవేందర్, రాజకుమార్, బాలయ్య, విజయ పాల్గొన్నారు.

కోనరావుపేట: సావిత్రిబాయి పూలే జయంతి మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాసంఘాల ఐక్య సమితి, టీమాస్ జిల్లా కమిటీ సభ్యుడు ఎరవెల్లి నాగరాజు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎగమంటి ఎల్లారెడ్డి, విమల, శ్యామల, రజిత, ప్రవళిక, సుజాత, పద్మ, సురేశ్, దేవయ్య పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా మామిడిపల్లి, సుద్దాల, బావుసాయిపేట, కనగర్తి, పల్లిమక్త, కొలనూర్ పాఠశాలల్లో, నిజామాబాద్‌లో చార్వాక ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దప్పుల అశోక్, వుచిడి రాజిరెడ్డి, గజ్జెల అశోక్, చెప్యాల గణేశ్ పాల్గొన్నారు.

ఫాజుల్‌నగర్ చెరువు నింపాలి



మాట్లాడుతున్న ఏనుగు మనోహర్‌రెడ్డి

వేములవాడఅర్బన్: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేసి ఫాజుల్‌నగర్ చెరువు నింపి, దాని ద్వారా నియోజకవర్గ చెరువులకు నీరు వదిలి రైతులను ఆదుకోవాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు మనోహర్‌రెడ్డి కోరారు. వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ చెరువుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆయన పరిశీలించారు. నియోజకవర్గానికి ఫాజుల్‌నగర్ చెరువు గుండెకాయలాంటిదన్నారు. నీరు లేక చెరువు అడుగంటిందన్నారు. ఈ చెరువు మీద ఆధారపడిన రైతులు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాటలు నమ్మి వరినారు పోశారని చెప్పారు. పది రోజుల్లో చెరువు నింపకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు ఎర్రం రాజు, రఫీక్, వకుళాభరణం శ్రీనివాస్, సోమినేని బాలు, రాఘవరెడ్డి, మ్యాకల శ్రీనివాస్, పర్శరాములు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

నేడు హరితహారంపై కలెక్టర్ సమీక్ష

బోయినపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ కృష్ణభాస్కర్ హరితహారంపై సమీక్ష నిర్వహిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రవీందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

'గోరుముద్ద' ప్రారంభం



విద్యార్థికి అల్పాహారం అందిస్తున్న సర్పంచ్ లక్ష్మీరాజం

బోయినపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమాన్ని బుధవారం తహసీల్దార్ దారప్రసాద్ ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మీరాజం విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముందుకు రావడంపై ఆయనను అభినందించారు. ఎంపీటీసీ పిట్టల రమేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రవీందర్, ఎంఈవో శ్రీనివాసదీక్షితులు, హెచ్‌ఎం బి.వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు గంగాధర్, శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎం.రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



శ్రీనివాస్
అంశం : ఉపాధిహామీ పనులు
ఈజీఎస్ ఏపీవో, బోయినపల్లి

బోయినపల్లి:

ప్రశ్న: మండలంలో ఉపాధిహామీ పథకంలో కొత్త పనులు గుర్తిస్తున్నారా?

జవాబు: మండలంలోని పలు గ్రామాలల్లో వచ్చే వేసవిలో చేపట్టే ఉపాధిహామీ పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: మండలంలో ప్రస్తుతం ఏ పనులు చేస్తున్నారు?

జవాబు: మండలంలో ఉపాధిహామీ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో కిచెన్‌షెడ్ల నిర్మాణం జరుగుతోంది. స్థలం అందుబాటులో ఉన్న గ్రామాల్లో శ్మశాన వాటికల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

ప్రశ్న: కిచెన్ షెడ్లు, శ్మశాన వాటికలు ఎన్ని గ్రామాలకు మంజూరయ్యాయి?

జవాబు: ఒక్కో కిచెన్‌షెడ్ రూ.2 లక్షల అంచనాతో, మండలంలోని బోయినపల్లి, మల్కాపూర్, కోరెం, మల్లాపూర్, నర్సింగాపూర్, విలాసాగర్, వెంకట్రావుపల్లి పాఠశాలలకు మంజూరయ్యాయి. శ్మశాన వాటికల నిర్మాణాలకు ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

ప్రశ్న: కూలీలందరికీ పని కల్పిస్తున్నారా?

జవాబు: ఉపాధిహామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ పని కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

చందుర్తి: పదోన్నతితో బాధ్యత పెరిగినట్లేనని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఖాజామోహినోద్దీన్‌కు ఏఎస్సైగా పదోన్నతి రావడంతో ఆయనకు స్టార్స్ అందించి అభినందించారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన వారికి పోలీసుశాఖలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఎస్సై మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.

పన్ను మినహాయింపునకు

ఉత్తమమార్గాలు

జ్యోతినగర్(రామగుండం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18) ముగింపునకు వచ్చేస్తోంది. ఆదాయపన్ను పరిధిలోకి వచ్చే వారంతా ఇప్పటికే చాలావరకూ పన్ను మినహాయింపులకు పెట్టుబడి పెట్టి ఉండాలి. వేతనజీవులు పన్ను ప్రణాళికను ఇప్పటినుంచే వేసుకోవాలి. దీంతో అసలు పన్ను లేకుండా/తక్కువ పన్నుతో రిటర్నులను ఫైల్ చేయవచ్చు. ఇలా వేతన ఉద్యోగులకు పన్ను మినహాయింపు పొందేందుకు ఉన్న పలు మార్గాలున్నాయి. అవి...

పిల్లల చదువుల ఫీజులు..

చదువులు ఖరీదైపోయాయి. పిల్లల ఫీజులు లక్షల్లో చెల్లిస్తున్నారు. ట్యూషన్ ఫీజుకు సంబంధించి ఆదాయపు పన్నుశాఖ మినహాయింపు నిస్తుంది. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపునకు క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇంటి అద్దె పన్ను మినహాయింపు

కంపెనీ వసతి కల్పించకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నవారికి పన్ను మినహాయింపు పొందవచ్చు.

- మీ మొత్తం ఆదాయంలో ఏది తక్కువైతే దానికి మినహాయింపు పొందవచ్చు.
- యాజమాన్యం ఇస్తున్న హెచ్ఆర్ఏ
- బేసిక్ శాలరీలో 40 శాతం+డీఏ
- చెల్లించిన ఇంటి అద్దె, 10 శాతం బేసిక్ శాలరీ+డీఏ

గృహ రుణం చెల్లింపు ద్వారా..

సొంత ఇంటి కోసం బ్యాంకులో అప్పు తీసుకుంటే చెల్లించే ఈఎంఐల ద్వారా పన్ను తగ్గించుకోవచ్చు. చెల్లించే అసలు, వడ్డీకి సంబంధించి వాయిదాల్లో కొంత వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. వడ్డీకి సెక్షన్ 24 కింద, చెల్లించే అసలుకు 80సీ కింద మినహాయింపు పొందొచ్చు. కొత్తగా ఇంటిని కొంటున్నట్లయితే/మొదటిసారి కొన్న గృహ రుణం చెల్లిస్తున్నట్లయితే ఎక్కువ మొత్తంలో పన్ను ఆదా చేసుకోవచ్చు.

విద్యారుణ ఈఎంఐలు..

ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారు. ట్యూషన్ ఫీజులకు పన్ను మినహాయింపున్నట్లే విద్యారుణానికి చెల్లించే ఈఎంఐలకు సైతం పన్ను మినహాయింపు ఉంటుంది.

విహారయాత్రల ఖర్చులు..

మీకు వచ్చే వేతనం పన్ను మినహాయించే వాటిలో ఎల్టీసీ కూడా ఉంటుంది. ఎల్టీసీ బ్లాక్ ఇయర్ 2014– 17 మధ్య ఉంది. నాలుగేళ్లలో రెండు సార్లు ఎల్టీసీఏ లేదా ఎల్టీసీ మినహాయింపు పొందవచ్చు. యాజమాన్యం ఇచ్చిన ఎల్టీసీఏ ఖర్చుల మేరకు పన్ను మినహాయింపులకు క్లయిం చేయొచ్చు.

వైద్య ఖర్చులు..

వైద్య ఖర్చులు నిత్య జీవితంలో వెచ్చించే ఖర్చుల్లో భాగమైంది. దీని నుంచి స్వాంతన పొందేందుకు ఆరోగ్య బీమా, ముందస్తు వైద్య పరీక్షలకు సంబంధించి అయ్యే ఖర్చులను పన్ను మినహాయింపు కింద చూపించొచ్చు. ఈ విధంగా రూ.60 వేల వరకు మినహాయింపు పొందొచ్చు.

జీవిత బీమా..

పెట్టుబడి కోణంలో కాకుండా రిస్క్ కవరేజ్ కల్పించేందుకు ఉపయోగపడే జీవిత బీమా సైతం ఆదాయ పన్ను మినహాయింపు కోసం అర్హత కలిగి ఉంది. సెక్షన్ 80సీ కింద కట్టే ప్రీమియంకు సంబంధించి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు కోరవచ్చు.

ఈపీఎఫ్..

పలు కంపెనీలు ఉద్యోగులకు పీఎఫ్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. పీఎఫ్ రూపంలో వేతనంలో మినహాయించే ధనాన్ని 80సీ కింద మినహాయింపు చూపించొచ్చు.

పీపీఎఫ్..

ఈపీఎఫ్ కాకుండా తక్కువ రిస్క్ తీసుకుంటూ దీర్ఘకాల పొదుపు చేయాలనుకునే వారికి పీపీఎఫ్ మరో మార్గ. పదిహేనేళ్ల పాటు మీ పెట్టుబడులను కొనసాగించవచ్చు. ఇది ఒక సంప్రదాయ పెట్టుబడి మార్గం. దాదాపు 8 శాతం వడ్డీ లభిస్తుంది. గరిష్టంగా ఏడాదికి రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి పెట్టవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన

కూతురి పేరిట డబ్బు పొదుపు చేసేందుకు ఉపయోగపడేది సుకన్య సమృద్ధి యోజన పథకం. తపాలా కార్యాలయం, బ్యాంకుల్లో ఈ పథకం ఖాతా తెరవవచ్చు. ఈ పథకంలో పెట్టే పెట్టుబడికి పన్ను మినహాయింపు ఉంది.

ప్రయోజనం..

సాక్షి
గురువారం | జనవరి | 4 | 2018
8&9

తెల్లారిందోయ్..



కల్లాపి: సిరిసిల్లలో వాకిట్లో కల్లాపి చల్లుతున్న వృద్ధురాలు

ప్యాకెట్ ఓకే: పెద్దపల్లిలో పాలప్యాకెట్ల వద్ద సందడి..

పేపర్.. పేపర్: పెద్దపల్లిలో పేపర్ వేసేందుకు వెళ్తున్న బాలుడు

వన్, టూ : పెద్దపల్లిలో వ్యాయామం చేస్తున్న వాకర్స్

క్లీనింగ్: పెద్దపల్లిలో మున్సిపల్ కార్మికుల ముచ్చట్లు

పిన్నీసులో..: సిరిసిల్లలో ప్లాస్టిక్ సామగ్రి విక్రయించేందుకు వస్తున్న మహిళ

పాలంబాట: పెద్దపల్లిలో కాడెడ్లతో పొలానికి వెళ్తున్న రైతు

చలిమంట: సిరిసిల్లలో చలిమంట కాగుతున్న ప్రజలు

కూరగాయలలో....: పెద్దపల్లిలో కూరగాయలతో వృద్ధుడు

గరంగరం: పెద్దపల్లి చాయ్‌వాలా దుకాణం వద్ద ఛాయ్‌కోసం...

తాజాగా...?: పెద్దపల్లిలో సాక్షి పేపర్ చదువుతూ...



మార్కెట్ సందడి: పెద్దపల్లి హోల్‌సేల్ మార్కెట్లో చిరు వ్యాపారుల రద్దీ



హెల్దీవాక్: మార్నింగ్ వాక్‌లో సిరిసిల్ల వనితలు..

నిన్న అనేది గడిచిపోయింది..

నేటికి సమయం ఆసన్నమైంది..

ఎముకలు కొరికే చలి భయపెడుతున్నా..

మంచు దుప్పట్లో పల్లె వెచ్చగా నిద్రిస్తోంది..

చీకటిని చీల్చుకుంటూ భానుడు రాకముందే..

చలిమంటలను చేతుల్లో బంధించి..

వణుకును ఒక్క ఛాయ్‌తో తరిమేసి..

జనం పనిబాట పడుతున్నారు..

కర్షకులు పట్టణం వైపు వస్తున్నారు..

ఈ రోజుకు శుభోదయం పలుకుతున్నారు..

ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగిపోతోంది. ఉదయం 7 గంటలు అయితే కానీ పక్కలోనుంచి లేవాలనిపించని పరిస్థితి. ఇలాంటి చలిలో కొందరు నిశిరాత్రి యోధులు వేకువజామున్నే నిద్రలేచి వారివారి విధుల్లో బిజీబిజీగా మారారు. పట్టణాల్లో పాలు, పేపర్ వేసేవాళ్లు, హోటళ్ల యజమానులు, పారిశుధ్య కార్మికులు ఎముకలు కొరికే చలిలోనూ వారివారి పనుల్లో నిమగ్నమవుతున్నారు. మంచు దుప్పటిని చీల్చుకుంటూ పల్లె కర్షకులు పట్టణబాట పడుతున్నారు. పాలు, కూరగాయలు తీసుకొచ్చి వేకువజామున్నే పట్టణాల్లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. చలికి తట్టుకోలేక వీధుల్లో చలిమంటలు కాగుతున్నారు. ఇంటి ఆడపడుచులు ముంగిళ్లను సింగారిస్తుంటే.. రైతులు కాడెడ్లతో పొలంబాట పడుతున్నారు. చలి తీవ్రత దృష్ట్యా పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల ప్రాంతాల్లో వేకువజామున 'జనసందడి'ని 'సాక్షి' తన కెమెరాల్లో బంధించింది.

ఫొటోల సేకరణ :
మర్రి సతీశ్‌కుమార్, పెద్దపల్లి ఫొటోగ్రాఫర్
వంకాయల శ్రీకాంత్, సిరిసిల్ల ఫొటోగ్రాఫర్



శరణం అయ్యప్ప: పెద్దపల్లి అయ్యప్ప ఆలయంలో భక్తులు